PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 327 | విజయవాడ, ఆదివారం 29 జూన్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 29 June 2025 | Rs

ఇండో అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను తిరస్కరించాలి

- రైతు సంఘాల నేతలు

3




ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలో అభివాదం చేస్తున్న అఖిల భారత మాజీ నేతలు

7

నూతన జాతీయ విద్యా విధానానికి ప్రత్యామ్నాయంగా ప్రజానుకూల విధానం

- ఎస్‌ఎఫ్‌ఐ 18వ అఖిల భారత మహాసభ డిమాండ్

పిల్లల్ని కనండి...! అందుకు ప్రభుత్వం ఏం చేయాలి?



అభిప్రాయ సేకరణ కోసం రూపొందించిన ప్రశ్నావళి ముఖచిత్రం

- రాష్ట్ర ప్రజలకు సర్కారు ప్రశ్నలు • జనాభా పెంపుకోసం సర్వే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

'ఎక్కువ మంది పిల్లల్ని కనాలంటే .... ఏం చేయాలి? కంగారు పడకండి! రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయాలి..అని! అర్థం కాలేదా...? ఒకరిద్దరు పిల్లల్ని పెంచి, వారికి మంచి భవిష్యత్తు అందించడానికి పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇప్పటికే నానా కష్టాలు పడుతుంటే, రాష్ట్ర ప్రజలందరూ అంతకు మించి ఎక్కువ సంతానాన్ని కనాలని కొంత కాలంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెబుతున్న సంగతి తెలిసిందే! జనాభా నిర్వహణ పేరిట దీనికోసం ఒక విధానాన్ని రూపొందించిన ప్రభుత్వం దానిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తోంది. నూతన జనాభా విధానంపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం ఈ సర్వే లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఈ సర్వే ప్రారంభమైంది కూడా! సర్వేలో భాగంగా రూపొందించిన ఎనిమిది ప్రశ్నల్లో ఏ విధమైన ప్రభుత్వ మద్దతు ప్రజలను ఎక్కువ మంది పిల్లల్ని కనడానికి ప్రోత్సహిస్తుంది' అన్న ప్రశ్న కూడా ఒకటి. ఆర్థికసాయంతో పాటు రాయితీలు ఇవ్వడం, ప్రసూతి వైద్య,శిశు సంరక్షణ సేవలను అభివృద్ధి చేయడం, నాణ్యమైన విద్యను అందుబాటులో ఉంచడం, ఆరోగ్యనిపుణులు, డాక్టర్ల చేత క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ నిర్వహించడం, ప్రభుత్వ నుండి ఎటువంటి సాయం అవసరం లేదు అన్న జవాబులు ఇచ్చి వాటిలోంచి ఏదో ఒకటి ఎన్నుకోవాలని సర్వేలో పాల్గొంటున్న వారిని ప్రభుత్వం కోరుతోంది. ఇతరత్రా ఏవైనా సాయం కావాలన్నా తెలపాలని పేర్కొంది. ప్రభుత్వ సిబ్బందే ఈ తరహా ప్రశ్నలు అడగడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతోంది.

ఎంతమంది పిల్లలు ఉండాలి...?

కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉండాలన్నది కూడా మరో ప్రశ్న. దీనిని నేరుగా అడగకుండా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎంతమంది పిల్లలుండాలని మీరు భావిస్తున్నారని ప్రభుత్వం అడిగింది. ఒకరు, ఇద్దరు, ఇద్దరి కన్నా ఎక్కువ అన్న జవాబులను ఇచ్చి, వాటిలో ఒక మిగతా 7లో

అమ్మో పెళ్లా...!

ప్రభుత్వం అడుగుతున్న ప్రశ్నలు ఎలా ఉన్నప్పటికీ సర్వేలో పాల్గొంటున్న యువతలో ఎక్కువ మంది పెళ్లి మాట ఎత్తితేనే ...'అమ్మో పెళ్లా...' అని పరుగులు పెడుతున్నారని సమాచారం. యువతలో ఎక్కువ మంది జీవితంలో స్థిరపడిన తరువాతే పెళ్ళైనా...ఇంకేదైనా అని అంటున్నారట! 'ఎప్పుడు స్థిరపడతారు' అన్న ప్రశ్నకు జవాబు ఉండటం లేదు. ఆసక్తికరమైన విషయమేమిటంటే సర్కారు సర్వేలో పెళ్లికి సంబంధించిన ప్రశ్నే లేకపోవడం! మధ్య వయస్కుల్లో ఎక్కువ మంది ఆదాయం, విద్య, వైద్యం వంటి అంశాలను ఏకరువు పెడుతున్నారు. అయితే, ఇవి ఊహించని సమాధానాలు కావని, సర్వే మొత్తం పూర్తయితే కాని, ఒక నిర్ధారణకు రాలేమని అధికారులు అంటున్నారు.



చరిత్ర సృష్టించిన స్మృతి మంధాన

- మూడు ఫార్మాట్‌లలోనూ సెంచరీ కొట్టిన తొలి భారతీయురాలిగా రికార్డు

నాటింగ్‌హామ్: మహిళా క్రికెటర్ స్మృతి మంధాన టి20ల్లో శతకం కొట్టి మూడు ఫార్మాట్‌లలో సెంచరీ కొట్టిన తొలి భారత క్రికెటర్‌గా రికార్డుపుటల్లోకెక్కారు. నాటింగ్‌హామ్ వేదికగా ఇంగ్లండ్ మహిళలతో శనివారం జరిగిన తొలి టి20లో మంధాన కేవలం 51 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 100 పరుగులు చేశారు. దీంతో మహిళల క్రికెట్ చరిత్రలో మూడు ఫార్మాట్‌లలో సెంచరీలు కొట్టిన ఐదో బ్యాటర్‌గా ఆమె చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలోనే భారత్ తరపున ఈ ఫార్మాట్‌లో సెంచరీ పూర్తి చేసిన, కెప్టెన్‌గా టి20ల్లో సెంచరీ బాదిన తొలి క్రికెటర్‌గా మంధాన పలు రికార్డులను తన పేర లిఖించారు. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ గైర్హాజరీలో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేశారు. ఛేదనలో ఇంగ్లండ్ జట్టును 14.5ఓవర్లలో 113 పరుగులకే పరిమితం చేసి 97 పరుగుల తేడాతో ఘన విజయం సాధించారు. దీంతో ఐదు టి20ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యతలో నిలువగా.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మంధానకు లభించింది.

ప్రైవేటుకే ప్రగతి చక్రాలు

ఆర్‌టిసి బస్సులు, సర్వీసు స్టేషన్ల నిర్వహణ ప్రైవేటుకు

ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు పథకం

ఆర్థిక ఇబ్బందులున్నా ఆక్యుపెన్సీకి తగ్గట్టు బస్సులు

సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసి బస్సులను, సర్వీసు స్టేషన్లను ప్రైవేటు సంస్థలు నిర్వహించడం, బస్సులను ఆపరేట్ చేయడంపై పూర్తిస్థాయి కసరత్తు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు పథకంపై ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయ మార్గాలను ఆర్‌టిసి పెంచుకోవాలని సూచించారు. ఖర్చు ఎలా తగ్గించుకోవాలి? ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని ఎలా పొందాలి అనే అంశంపై దృష్టి పెట్టాలని చెప్పారు. దీనికోసం సమర్థతను పెంచుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తామని, ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఎదురైనా ఆక్యుపెన్సీకి తగ్గట్టు బస్సులు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ పథకం అమలుకు వీలుగా కొత్త బస్సులు కొనడంగానీ, అద్దెకు తీసుకోవడంగానీ చేయాలని సూచించారు.

ఇకపై ఇవి బస్సులే...

ఇకపై ఆర్‌టిసిలో అన్నీ ఇవి బస్సులనే ప్రవేశపెట్టాలని చంద్రబాబు అన్నారు. ఇప్పుడున్న బస్సులను ఇవి బస్సులుగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి బస్సుకు జిపిఎస్ తప్పనిసరిగా అమర్చాలని అధికారులకు సూచించారు. . ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సి ఉందని, ప్రజాధనం సద్వినియోగం కావాలని, ప్రతి రూపాయి విలువైన దేనని తెలిపారు. ప్రయాణికుల్లో సంతృప్తి పెరిగేలా చూడాలని ఆదేశించారు. బ్యాటరీ స్వాపింగ్ విధానం



తో ఆర్‌టిసి బస్సుల నిర్వహణ వ్యయం తగ్గే అంశాన్ని పరిశీలించాలని, డీజిల్, ఇవి, సిఎన్‌జి ఏ బస్సు కొనుగోలు నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందనే ప్రతిపాదనలు రూపొందించాలని కోరారు.

అదనంగా 2,536 బస్సులు కావాలి

కొత్త పథకం అమలుకు అదనంగా 2,536 బస్సులు అవసరమని, దీనికి రూ.996 కోట్లు ఖర్చు అవుతుందని, తాగునీటి సదుపాయం, టాయిలెట్ల నిర్వహణ, బస్సుల సమాచార బోర్డుల నిర్వహణ వంటి అన్ని సౌకర్యాలు మెరుగుపర్చాల్సి ఉందని అధికారులు సిఎంకు వివరించారు. రాష్ట్రంలో మహిళలు పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, సిటీ బస్సుల్లో ప్రస్తుతం 43.06 కోట్ల సార్లు ప్రయాణిస్తున్నారని, ఉచిత బస్సు పథకం అమలయితే ఇది 75.51 కోట్లకు చేరుకుంటుందని అధికారులు సిఎంకు వివరించారు. ఎక్స్‌ప్రెస్, మెట్రో సర్వీసుల్లో ఏడాదికి 6.85 కోట్ల ప్రయాణాలు సాగుతున్నాయని, పథకం అమలయితే 13.39 కోట్లకు పెరగొచ్చని పేర్కొన్నారు. మొత్తంగా ఉచిత బస్సు పథకం ద్వారా మహిళలు 88.90 కోట్ల సార్లు ప్రయాణించే వీలుందని సిఎంకు తెలిపారు. మొత్తంగా బస్సుల్లో 57 శాతం పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, సిటీ బస్సులు ఉన్నాయని సిఎంకు వివరించారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

చిట్టీల పేరుతో టోకరా

- పోలీసు స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం తోకతిప్పలో చిట్టీల పేరుతో టోకరా పెట్టిన ప్రబుద్ధుడి ఉదంతం శనివారం వెలుగుచూసింది. బాధితుల వివరాల మేరకు...తోకతిప్ప గ్రామానికి చెందిన పొన్నాడ వీరవెంకటరమణ చిట్టీల వ్యాపారం నిర్వహించేవాడు. దీంతో గ్రామానికి చెందిన రోజు వారీ కూలీలు, గ్రామస్తులు అతని వద్ద నెలవారీ చిట్టీలు వేసేవారు. పాట పాడుకున్న వారికి డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండేవాడు. గట్టిగా నిలదీస్తే వడ్డీ ఇస్తానని చెప్పి ఓ కాగితం మీద రాసిచ్చేవారు. తోకతిప్పలోనే కాకుండా భీమవరం మండలంలో పలు గ్రామాలతోపాటు, మొగల్తూరు మండలం, కృష్ణా జిల్లా కృతివెన్ను మండలాల్లో పలువురి దగ్గర ఈ విధంగా సొమ్ము స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల సొమ్ము కోసం వెంకటరమణపై ఒత్తిడి పెరగడంతో తోకతిప్పలోని ఇంటిని ఖాళీ చేసి పరారయ్యాడు. మొత్తంగా రూ. ఐదుకోట్ల మేర మోసం చేసినట్లు తెలిపారు. దీంతో బాధితులంతా లబోదిబోమంటూ శనివారం భీమవరం రూరల్ పోలీసులను ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలంటూ స్టేషన్ వద్ద కొద్దిసేపు నినదించారు. అనంతరం రూరల్ ఎస్ఐ వీర్రాజుకు వినతిపత్రం అందజేశారు.

న్యాయ విద్యార్థిని తక్షణమే విడుదల చేయండి

- సుప్రీం ఆదేశాలు

7

స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్

3



జిడిపికి వ్యవసాయం దన్ను

- 2023-24లో 7 శాతం వృద్ధి

3

అన్నదాతా.. దోబూచులాట

- రేపు మాపు అని ఊరింపు
- పిఎంకిసాన్ ఎప్పుడో అప్పుడేనని కొత్త పల్లవి
- ఇంకా ఖరారుకాని మార్గదర్శకాలు
- కౌల్దార్లకు ఇప్పుడే కాదని లీకులు
- వర్షాలతో ఖరీఫ్ పెట్టుబడుల కోసం రైతుల ఎదురుచూపు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ఉద్దేశించిన 'అన్నదాతా సుఖీభవ..' అంతకంతకూ ఆలస్యమవుతోంది. రోజుకో ప్రకటనతో ప్రభుత్వం అన్నదాతలతో దోబూచులాడుతోంది. వర్షాలు మొదలు కావడంతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు పెట్టుబడుల కోసం ప్రభుత్వంకేసి చూస్తున్నారు. ప్రభుత్వం తొలుత మే నెలలో ఇస్తామని చెప్పి, అనంతరం జూన్‌కు వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. జూన్ 21న రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఢంకా భజాయించారు. ఆ గడువు ముగిసినా అన్నదాతా..పై ప్రభుత్వంలో కదలిక లేదు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు పిఎంకిసాన్ కిస్తు జమ చేస్తే, అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా సొమ్ము జమ చేస్తుందని మాట మార్చారు. కాగా పిఎంకిసాన్ కిస్తుపై ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదు. మొదట్లో జూన్ చివరాఖరులోనన్నారు. ఇప్పుడు జులై అంటున్నారు. కేంద్రం పిఎంకిసాన్ విడుదల చేసే వరకు రాష్ట్ర ప్రభుత్వ సాయం కోసం రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్రం స్వంత భూమి కలిగిన రైతులకే పిఎంకిసాన్ సాయం చేస్తోంది. కౌలు రైతులకు రాష్ట్ర ఖజానా నుంచి మొత్తం నిధులూ భరిస్తామని కూటమి సర్కారు హామీ ఇచ్చి, కౌలు రైతులకు భూయజమానులతో కాకుండా ఎప్పుడో అక్టోబర్, జనవరిలో రెండు వాయిదాల్లో సాయం చేస్తామంటోంది.

గైడ్‌లైన్స్ లేకుండా...

టిడిపి కూటమి ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలలో అన్నదాతా.. ఒకటి. రైతులు, కౌలు రైతులు సేద్యం సాగించేందుకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తామన్నారు. అధికారంలోకొచ్చాక తొలేడాది ఇవ్వలేదు. రెండవ సంవత్సరం నుంచి అన్నారు. గత వైసిపి ప్రభుత్వానికిమల్లే ఏడాదిలో మూడు విడతల్లో, కేంద్ర పథకం పిఎంకిసాన్‌తో కలిపి అమలు చేస్తామని చెబుతున్నారు. కౌలు రైతులకు మొత్తం నిధులూ రాష్ట్రమే భరిస్తుందన్నారు. ఇవన్నీ మాటలే తప్ప ఇప్పటి వరకు స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల కాలేదు. అయినప్పటికీ అన్ని లక్షల మంది, ఇన్ని లక్షల మంది అని సర్కారు నుంచి ప్రకటనలు జారీ చేసి మరింత గందరగోళానికి కారణమవుతున్నారు. తాజాగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ 47.77 లక్షల మందిని అర్హులుగా గుర్తించి ఇ-కెవైసి పరిశీలనకు పంపామన్నారు. వెరిఫికేషన్ 98 శాతం పూర్తయిందంటున్నారు తప్ప ఎంత మందిని తిరస్కరించారో వెల్లడించలేదు. అసలు విధి విధానాలు రాకుండా ఏ ప్రాతిపదికన మిగతా 7లో

మామిడి రైతులకు బెదిరింపులు

- వాల్టా చట్టం కింద కేసులు పెడతాం
- జైలుకు వెళ్తారని ఉద్యానశాఖ హెచ్చరికలు



సోమలలో కార్మికులను పెట్టి చెట్లను కొట్టేయిస్తున్న మామిడి రైతు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

గిట్టుబాటు ధర లేక, ప్రభుత్వం ఆదుకోకపోవడంతో కడుపు మండిన మామిడి రైతు తమ చెట్లను తొలగిస్తుండగా ఉద్యానవనశాఖ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. చెట్లను నరకడం తప్పని, వాల్టా చట్టం కింద కేసులు పెడతామని, జైలుకు వెళ్లడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. వయస్సు పైబడిన చెట్లను మాత్రం తొలగిస్తున్నామని రైతులతో బలవంతపు వాంగ్మూలాలు తీసుకుంటుంది. ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు సమాచారం.

'కడుపు మండిన మామిడి రైతు' అనే శీర్షికతో ప్రజాశక్తిలో శనివారం కథనం రావడంతో ఉద్యానవన శాఖ అప్రమత్తమైంది. రామచంద్రాపురం మండలానికి వెళ్లి రైతులను బెదిరించి, తమ ఇష్ట ప్రకారమే చెట్లను నరికేసినట్లుగా వారి వద్ద వాంగ్మూలం తీసుకుంది. బాధిత రైతులను 'ప్రజాశక్తి' పలకరించగా కేసులు పెడతాం, జైలుకు పంపిస్తామని అధికారులు బెదిరించడంతో బలవంతపు వాంగ్మూలం ఇచ్చినట్లు చెప్పారు. ఇదే విషయమై ఉద్యానవన శాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా 'నలభై ఏళ్లు పైబడి ఉన్న చెట్లకు కాపు సరిగ్గా లేదని రైతులే కొట్టేశారు' అని చెప్పడం గమనార్హం. వాస్తవ పరిస్థితులు గమనిస్తే గిట్టుబాటు ధర రాక, మరోమార్గం లేక చెట్లు నరికివేస్తున్నట్లు స్పష్టమౌతోంది. పివిపురం గ్రామానికి చెందిన రైతు గిరి తన పది ఎకరాల్లో మామిడి చెట్లు నాటి పది సంవత్సరాలు అయ్యింది. రామిరెడ్డిపురానికి చెందిన చంద్రశేఖర్‌వి ఏడేళ్లు, గెడ్డకిందపల్లికి చెందిన రైతు దేవరాజులురెడ్డివి 15, గోకులాపురానికి చెందిన దొరస్వామిరెడ్డివి 18, అనుప్పల్లికి చెందిన ప్రకాష్‌వి 27, నెత్తకుప్పం ఆకా రామయ్య మామిడి చెట్లు నాటి 14 ఏళ్లయ్యింది. 50 ఏళ్లయినా కాయలు కాస్తాయని, ఈ ఏడాది అధిక దిగుబడులు వచ్చాయని పలువురు రైతులు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రామచంద్రాపురం, తవణంపల్లి, సోమల, పూతలపట్టు, యాదమరి, గంగాధరనెల్లూరు, వెదురుకుప్పం, సదుం తదితర మండలాల్లో వందల ఎకరాల్లో మామిడితోటలు నేలమట్టమయ్యాయి. తిరుపతికి కూతవేటు దూరంలోని రామచంద్రాపురం మండలంలో పివిపురం, రామిరెడ్డిపురం, పుల్లమనాయుడు కండ్రిగ, గెడ్డకిందపల్లి, గోకులాపురం, అనుప్పల్లి, గంగిరెడ్డిపల్లి, నెత్తకుప్పంలోనే దాదాపు 50 ఎకరాలను మూడు రోజులుగా కార్మికులను పెట్టి తొలగిస్తున్నారు.

'రా' చీఫ్‌గా పరాగ్ జైన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



'రీసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్ (రా)' చీఫ్‌గా పంజాబ్ కేడర్ ఐపిఎస్ అధికారి పరాగ్ జైన్ నియమితులయ్యారు. ప్రస్తుత చీఫ్ రవి సిన్హా పదవీకాలం ఈ నెల 30 (సోమవారం)తో ముగియనుండటంతో.. రా చీఫ్‌గా పరాగ్ జైన్‌ను నియమిస్తూ నియామకాల కేబినెట్ కమిటీ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జులై ఒకటిన బాధ్యతలు చేపట్టనున్న పరాగ్ జైన్ రెండేళ్లపాటు ఆ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం ఆయన ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్ (ఎఆర్‌సి) అధిపతిగా సేవలందిస్తున్నారు. ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో జైన్ కీలక పాత్ర పోషించారు. పంజాబ్ కేడర్ 1989 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన పరాగ్ జైన్‌కు వ్యూహాత్మక ఇంటెలిజెన్స్ వర్క్, ఫీల్డ్ ఎక్స్‌పీరియన్స్‌లో విశేషానుభవం ఉంది. ప్రస్తుతం 'రా'లో ఆయన రెండో మోస్ట్ సీనియర్‌గా ఉన్నారు. 2021లో పంజాబ్‌లో డిజిపి ర్యాంక్ పొందిన జైన్, డిప్యూటేషన్‌పై కేంద్ర సర్వీసుల్లోకి వచ్చారు.



దక్షిణ లెబనాన్‌లోని నబాతియా జిల్లా మార్జయౌన్‌లో ఇజ్రాయిల్ వైమానిక దాడులతో వెలువడుతున్న పొగ

కాల్పుల విరమణ ఉల్లంఘన

- లెబనాన్‌పై మళ్లీ ఇజ్రాయిల్ వైమానిక దాడులు

బీరుట్ : లెబనాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘించింది. చాలా కాలం తర్వాత లెబనాన్‌పై ఏకపక్షంగా నివాస భవంతిపై వైమానిక దాడులకు దిగింది. శుక్రవారం రాత్రి జరిగిన దాడిలో ఒక మహిళ మరణించగా, డజనుమందికి పైగా గాయపడ్డారని ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. నబతియా ప్రాంతంలో నివాస భవంతిని లక్ష్యంగా చేసుకుని ఈ వైమానిక దాడి జరిగిందని, నగర శివార్లలో జరిగిన దాడుల్లో మరో ఏడుగురు గాయపడ్డారని లెబనాన్ ప్రభుత్వ వార్తా సంస్థ నేషనల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ఆకాశంలో విమానాల రొద వినబడుతుండగా, దాడులు జరిగిన ప్రాంతంలో కొండపై నుండి దట్టంగా పొగ కమ్ముకోవడం కనిపిస్తోంది. ఈ మేరకు మీడియా ఫుటేజీ విడుదల చేసింది.

ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘించింది : లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్

తాజాగా దాడులకు పాల్పడడం ద్వారా ఇప్పటికే ఉభయపక్షాలు నవంబరులో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించిందని లెబనాన్ మిగతా 7లో

మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట

- సురక్షా 360 ప్రారంభోత్సవంలో హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - విజయవాడ

మహిళల రక్షణకు టిడిపి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, శక్తి యాప్ ద్వారా వారికి భద్రత, భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడ మాచవరం పోలీసు స్టేషన్ పరిధిలో సుజన ది వెన్యూ ఫంక్షన్ హాల్లో ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 321 గ్రామాలు, 20 మండలాలు, 4 మున్సిపాలిటీలు, ఒక నగరపాలక సంస్థ, 64 వార్డులు మొత్తం 1211 చదరపు కిలో మీటర్ల మేర నగరాల నుండి గ్రామాల వరకు వంద శాతం సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షించే విధంగా ఏర్పాటు చేసిన సురక్షా 360ను మంత్రి అనిత శనివారం ప్రారంభించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ సీసీ కెమెరాల ద్వారా గ్రామాల్లో నేరాల సంఖ్య తగ్గిందన్నారు. మొబైల్‌ను రక్షణగా, అస్త్రంగా వినియోగించుకోవాలని తెలిపారు. వాట్సప్ సెంటర్‌కు ఒక్క సందేశం పంపిస్తే పోలీసులు అప్రమత్తం అవుతారన్నారు. పోలీసింగ్ వ్యవస్థ ప్రజలకు చాలా చేరువవుతోందని, టెక్నాలజీ వినియోగంలో ఎన్టీఆర్ జిల్లా ముందంజలో ఉందని తెలిపారు. మోడల్ పోలీస్ స్టేషన్లను జిల్లా మొత్తం విస్తరించాలన్నారు. సురక్ష యాప్, సురక్ష డివైస్ వల్ల ప్రజలకు ఎంతో మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, పలువురు ఎంఎల్ఎలు, అధికారులు పాల్గొన్నారు.

జులై 2 వరకు ఉచిత సీట్ల నిర్ధారణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన ఉచిత ప్రవేశాల రెండో జాబితా నిర్ధారణ గడువు జులై 2వ తేదీ వరకు పొడిగించినట్లు సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈ నెల 28లోపు సంబంధిత పాఠశాలలకు వెళ్లి నిర్ధారించుకోవాలని తొలుత గడువు విధించామని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారుల విన్నపం మేరకు జులై 2వ తేదీ వరకు గడువు పొడిగించామని వెల్లడించారు. రెండో దశలో 8,583 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. సంబంధిత పాఠశాల యాజమాన్యాలు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అడ్మిషన్లు ఇవ్వాలని ఆదేశించారు. సరైన కారణం లేకుండా అడ్మిషన్లు నిరాకరిస్తే పాఠశాల యాజమాన్యాలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిఎస్‌సి పిజిటి ఇంగ్లీష్‌కు 89.81 శాతం హాజరు

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన డిఎస్‌సిలో పిజిటి ఇంగ్లీష్ పరీక్షకు 89.81 శాతం అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని మెగా డిఎస్‌సి కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 47 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 8,353 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 7,502 (89.81 శాతం) మంది హాజరయ్యారని వెల్లడించారు. శాఖపట్నంలో అత్యధికంగా 92.71 శాతం అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.



విజయవాడ ధర్నా చౌక్‌లో ఆందోళనలో పాల్గొన్న సిపిఎం నాయకులు సిహెచ్ బాబూరావు, కాశీనాథ్, కార్మికులు, తదితరులు



గుంటూరు జిల్లా తాడేపల్లి - మంగళగిరి మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఆందోళనలో పాల్గొన్న ఏపి మున్సిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

- సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- పలుచోట్ల మున్సిపల్ కార్మికుల నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కనీస వేతనం, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు శనివారం దీక్షలు చేపట్టి నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేశారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికుల వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. విజయవాడలో మున్సిపల్ ఇంజనీరింగ్ (వాటర్, పార్కు, వెహికల్ డిపో, మెకానిక్, టౌన్‌ప్లానింగ్, స్ట్రీట్ లైటింగ్, కంప్యూటర్ ఆపరేటర్లు) కార్మికుల సమ్మె శనివారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, పిల్లలతో సహా ధర్నాచౌక్‌లో ఆందోళన నిర్వహించారు. విజయవాడ నగరపాలక సంస్థలోని మంచినీటి సరఫరా, పార్కులు, వీధిలైట్లు, ప్రజారోగ్య విభాగం, మెకానిక్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు సమ్మెతో కార్యకలాపాలు స్తంభించాయి. కార్మికుల సమ్మెకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు మద్దతు తెలిపారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తక్షణమే స్పందించి మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరపాలని, న్యాయబద్ధంగా వారి వేతనాలు తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిరసన ప్రదర్శనలు చేశారు. రాయదుర్గం, ధర్మవరం, హిందూపురం తదితర ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి మున్సిపల్ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. తూర్పు గోదావరి జిల్లాలో కార్మికుల సమ్మె 53వ రోజుకు చేరుకుంది. కాకినాడ జిల్లా పెద్దాపురం, సామర్లకోట, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట, అమలాపురం, రామచంద్రపురం, తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీల ఎదుట సమ్మె శిబిరాలు కొనసాగుతున్నాయి. పెద్దాపురంలో సమ్మెకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, నరసాపురం మున్సిపల్ కార్యాలయాల వద్ద ఆరో రోజు ఆందోళన కొనసాగించారు. తాడేపల్లిగూడెం, నరసాపురంలో మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రాలు సమర్పించారు.

జాబ్ కేలండర్ విడుదల చేయాలి

- డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఖాళీ పోస్టుల భర్తీ కోసం జాబ్ కేలండర్‌ను విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి రామన్న, వై రాము శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతియేటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నారని, జాబ్ కేలండర్ విడుదల కోసం నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్ల కోసం 10 లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారన్నారు. జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల లెక్చరర్ ఖాళీ పోస్టులు, యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అటవీశాఖలోని 800 బీట్ ఆఫీసర్, రేంజ్ ఆఫీసర్ పోస్టులకు ఆర్థికశాఖ అనుమతినిచ్చినా ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ శాఖలో 15 వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఖాళీగా ఉన్న 3 వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎపిపిఎస్‌సి ద్వారా ఇచ్చిన 18 నోటిఫికేషన్ల పోస్టుల భర్తీ ప్రక్రియ వివిధ దశల్లో ఉన్నాయని, వీటిని త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జాబ్ కేలండర్ ప్రకటించాలని, లేదంటే తాము ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - దేవీపట్నం (అల్లూరి జిల్లా)

పోలవరం నిర్వాసితుల సమస్యలను తక్షణం ప్రభుత్వం పరిష్కరించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. నిర్వాసిత కాలనీల్లో సౌకర్యాలు మృగ్యంగా మారాయని అన్నారు. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం పెనికలపాడు పోలవరం నిర్వాసిత కాలనీలో సిపిఎం బృందం శనివారం పర్యటించింది. అక్కడి సమస్యలను లోకనాథం, పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, తదితరులు తెలుసుకున్నారు. అనంతరం లోకనాథం మాట్లాడుతూ... పోలవరం నిర్వాసిత కాలనీల్లోని ప్రజలు తాగడానికి మంచినీళ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన వారిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కొన్ని కాలనీల్లో బాత్రూములు కట్టకుండా డబ్బులు తీసుకుని కాంట్రాక్టర్ వదిలేసిన పరిస్థితులు ఉన్నాయని, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడన్నారు. నిర్వాసితులను గ్రామాల నుండి ఖాళీ చేయించిన పిదప జిరాయితీ, డి.ఫారం భూములకు డబ్బులు ఇవ్వకుండా అధికారులు మోసం చేస్తున్నారన్నారు. 2013 భూసేకరణ చట్టం ఎక్కడా అమలు కావడం లేదని పేర్కొన్నారు. రూ.10 లక్షల ప్యాకేజీ ఇవ్వాల్సి ఉండగా రూ.6.50 లక్షలు, కొన్నిచోట్ల రూ.5 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. అంగన్‌వాడీ సెంటర్లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుంటే ఐటిడిఎను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.వాణిశ్రీ, నాయకులు శాంతిరాజు, శ్రీను, రాము పాల్గొన్నారు.

అమృత్ సిటీల్లో స్మార్ట్ మీటర్లు

- బలవంతంగా ఇళ్లకు బిగింపు
- వినియోగదారుల అనుమతితో నిమిత్తం లేకుండానే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమృత్ సిటీల్లోని వినియోగదారులకు విద్యుత్ పంపిణీ సంస్థలు అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నాయి. వినియోగదారుడి అనుమతితో నిమిత్తం లేకుండానే ప్రస్తుతం ఉన్న మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను ఏకపక్షంగా రుద్దుతున్నాయి. కొన్నిచోట్ల ప్రజలు వీటిని బిగించొద్దని చెబుతున్నా పట్టించుకోకుండా బలవంతంగా అమరుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్‌డిఎస్‌ఎస్) విధానాన్ని తీసుకొచ్చింది. ఈ స్కీంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టగా, అందులో స్మార్ట్ మీటర్లు ముఖ్యం. గత వైసిపి ప్రభుత్వం వీటి అమలులో భాగంగా వ్యవసాయ పంపుసెట్లకు అమర్చింది. ప్రతిపక్షంలో ఈ స్మార్ట్ మీటర్ల బిగింపును తీవ్రంగా వ్యతిరేకించడమే కాకుండా వీటిని పగలగొట్టాలని ఆనాడు టిడిపి.. ప్రజలకు పిలుపునిచ్చింది. అధికారంలోకి రాగానే గత ప్రభుత్వ విధానాన్ని కొనసాగిస్తోంది. తొలుత అమృత్ సిటీల్లోని గృహ వినియోగదారులకు ఈ స్మార్ట్ మీటర్లను అమరుస్తున్నారు.

విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, కడప వంటి 10 కార్పొరేషన్లతో పాటు 21 మున్సిపాల్టీలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ నగరాల్లో 500 యూనిట్ల వాడకం దాటిన వారికే ఏర్పాటు చేస్తామని తొలుత చెప్పిన విద్యుత్‌శాఖ ఆచరణలో మాత్రం అందరికీ బిగించేస్తోంది. సుమారు 27 లక్షల మంది కనెక్షన్లకు ఈ మీటర్లను తొలి జాబితా కింద బిగిస్తున్నాయి. ఎలాంటి భారం పడదని వినియోగదారులను నమ్మించి మీటర్లను బిగిస్తున్నారు. అయితే ప్రతిఘటించిన చోట్ల మాత్రం సర్కారు వెనక్కి తగ్గుతోంది.



గంట గంటకూ మోతకే 'స్మార్ట్'

విద్యుత్ వినియోగదారులపై భారాలు అధికంగా మోపేందుకే ఈ స్మార్ట్ మీటర్లను డిస్కంలు తీసుకొస్తున్నాయని విద్యుత్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2025–26 ఎఆర్ఆర్ టారీఫ్ విడుదల చేసిన ఎపిఇఆర్‌సి 'టైమ్ ఆఫ్ ద డే' విధానానికి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ విధానం అమల్లోకి వస్తే పీక్ సమయంలో విద్యుత్ వాడితే డిస్కంలు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణల పేరుతో వినియోగదారులపై భారాలు పడే విధంగా కొత్త, కొత్త విధానాలను తీసుకొస్తున్నాయి. స్మార్ట్ మీటర్ల వల్ల బిల్లులు అధికంగా వస్తున్నాయని చిరు వ్యాపారులు ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ భారాలతో అల్లాడుతున్న ప్రజల జేబులకు స్మార్ట్ మీటర్ల రూపంలో మరింత చిల్లు పడనుంది.

భారం 93 నెలలు

స్మార్ట్ మీటర్ల భారం వినియోగదారులపై 93 నెలలు పడనుంది. ఒక్కో మీటర్ ధర రూ.10,205లుగా డిస్కంలు టెండర్లు పిలిచి ఖరారు చేశాయి. ఈ టెండర్లను అదానీకి, షిర్డీ సాయి కంపెనీలకు నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరకు కట్టబెట్టారని ప్రతిపక్షంలో టిడిపి తీవ్ర విమర్శలు గుప్పించింది. రాజస్థాన్‌లో ఒక్కో మీటర్ నిర్వహణతో కలిపి రూ.7,945 ధర ఉంటే రాష్ట్రంలో మాత్రం 10,205లకు టెండర్ ఖరారు చేశారు. వీటికయ్యే ఖర్చును డిస్కంలు వినియోగదారుల నుంచే వసూలు చేయనున్నాయి. 93 నెలల పాటు రూ.109.74 చొప్పున వసూలు చేస్తాయి. ప్రస్తుతం గుట్టుచప్పుడు కాకుండా స్మార్ట్ మీటర్లను డిస్కంలు బిగించి అనంతరం వినియోగదారుల నుంచి డబ్బు గుంజుతాయి.



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అది మానవ హక్కుల ఉల్లంఘనే

- తెనాలి పోలీసులు రాజ్యాంగం, కోర్టులు, చట్టాలను అపహాస్యం చేశారు
- ఈ కేసును కోర్టులు సుమోటోగా స్వీకరించాలి
- మానవ హక్కుల పరిరక్షణ సదస్సులో వక్తల డిమాండ్

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

సంఘ వ్యతిరేక శక్తులను పెంచి పోషిస్తున్న ప్రభుత్వమే అమాయకులను బలిచేస్తుందని, తెనాలి పోలీసులది మానవ హక్కుల ఉల్లంఘనే అని, బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇటీవల తెనాలిలో దోమ రాకేష్, చేబ్రోలు జాన్ విక్టర్, షేక్ కరిముల్లాపై పోలీసులు నడిరోడ్డుపై అమానుషంగా హింసించడాన్ని ఖండిస్తూ గుంటూరు జిల్లా తెనాలిలో దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యాన మానవ హక్కుల పరిరక్షణ సదస్సు శనివారం సాయంత్రం జరిగింది. సదస్సులో సిపిఎం, సిపిఐ, బిఎస్‌పి, కాంగ్రెస్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, కెఎస్‌పిఎస్, కెవిపిఎస్ తదిత ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రముఖ న్యాయవాది పిసి విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికార పార్టీ అండతోనే గంజాయిని పోలీసులే పెంచి పోషిస్తున్నారన్నారు. గంజాయి వ్యాపారాన్ని ఆసరాగా చేసుకొని అడ్డదారులు తొక్కుతున్న పోలీసు వ్యవస్థ దానిని అమాయకులకు ఆపాదించి కేసులలో ఇరికించి ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. నడిరోడ్డుపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని జిల్లా ఎస్‌పి, రాష్ట్ర హోం శాఖా మంత్రి సమర్థించడం బాధాకరమన్నారు. తక్షణమే ఈ ఘటనను హైకోర్టు, సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలని, సిఐలు, కానిస్టేబుళ్లతోపాటు వారి చర్యలను సమర్థించిన జిల్లా ఎస్‌పిని తక్షణమే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్ మాట్లాడుతూ చైతన్యవంతమైన తెనాలిలో ఇలాంటి ఘటనలు బాధాకరమన్నారు. దళితులు, మైనార్టీలే లక్ష్యంగా రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి ఘటనలను కులాలకతీతంగా ఖండించాలని, బాధ్యులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. ప్రజలను రక్షించాల్సిన పోలీసులే వారిని హింసిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో దళితులపై ఇలాంటి దాడులు కొనసాగుతున్నాయన్నారు. ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో దళితుల సామాజిక బహిష్కరణ ఇందుకు ఉదాహరణ అన్నారు. ఎస్‌సి కమిషన్ మాజీ చైర్మన్ ఎం విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేక శక్తులు రాష్ట్రాన్ని పాలిస్తున్నాయని విమర్శించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరెడ్డి, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌జె సాగర్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు చెన్నకేశవులు, మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు సుంకర పద్మశ్రీ, కెఎన్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కె కష్ణ, ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పి వెంకటేశ్వరరావు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు రవిప్రసాద్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

- ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి
- పట్టణాభివృద్ధి శాఖ సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపాలిటీలూ, కార్పొరేషన్లలో శానిటేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. పట్టణాభివృద్ధిశాఖపై ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌శాఖ పరిధిలోని ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వం ఈ పద్ధతిని అస్తవ్యస్తం చేసిందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. డ్వాక్రా పొదుపు సంఘాలను బలోపేతం చేయడంతోపాటు వారి ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. కేంద్రం నుండి రావాల్సిన నిధులను రాబట్టుకోవాలని సూచించారు. ఈ సమావేశం అనంతరం క్యాంపు కార్యాలయం బయట మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీలో వందశాతం రక్షిత తాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, రోడ్లు, పార్కులను కోరుకుంటున్నారని తెలిపారు. గతంలో అభివృద్ధి పనుల కోసం ఎఐఐబి నుంచి రూ.5,800 కోట్లు తీసుకొచ్చామన్నారు. కేంద్రం నుండి రూ.3 వేల కోట్ల విడుదలకు ఆమోదం తెలిపామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా విడుదల చేయకపోవడంతో నిధులు మధ్యలోనే నిలిచిపోయాయని పేర్కొన్నారు. అన్నిటినీ పరిష్కరించుకుంటూ వస్తున్నామని వివరించారు. ఇప్పటికే అమృత్ స్కీమ్ నిధులకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందని, టెండర్లూ పిలిచామని వివరించారు. ఈ పనులు పూర్తయితే 85 శాతం ఇళ్లకు నేరుగా తాగునీరు అందుతుందని వివరించారు. అయితే బోర్ల నుంచి వచ్చే నీరు కాకుండా నదులు, కాలువల ద్వారా నీటిని ఇళ్లకు సరఫరా చేస్తామని తెలిపారు. ఎఐఐబి నుంచి వచ్చే రూ.5,350 కోట్లతో మిగిలిన డ్రింకింగ్ వాటర్ పనులు పూర్తి చేస్తామని వివరించారు. 2029 నాటికి రాష్ట్రంలో మురుగునీటిని శుద్ధి చేసేందుకు పూర్తిస్థాయిలో ఎస్‌టిపిలు నిర్మిస్తామని అన్నారు. ప్రతిరోజూ రాష్ట్రంలో 8 వేల టన్నుల ఘన వ్యర్థాలు ఉత్పత్తవుతున్నాయని, వీటి నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గతంలో పది వేస్టు ఎనర్జీ ప్లాంట్లు నిర్మిస్తే వాటిల్లో ప్రస్తుతం రెండే నడుస్తున్నాయని అన్నారు. కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతిలో ప్లాంట్ల ఏర్పాటుకు టెండర్లు పిలుస్తామని, ఈ ప్లాంట్లన్నీ అందుబాటులోకి వస్తే 7,500 టన్నుల చెత్త ప్రతిరోజూ విద్యుత్‌గా మారుతుందని అన్నారు. మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ కోసం కాంపాక్టర్లు, స్వీపింగ్ మెషిన్ల కోసం రూ.225 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. 2014–19లో 5 లక్షల టిడ్కో ఇళ్ల పనులు ప్రారంభించగా, గత ప్రభుత్వం 2.60 లక్షలకు తగ్గించిందని వివరించారు. త్వరలోనే టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని అన్నారు. మున్సిపాలిటీల్లో ఇంజినీరింగ్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మెపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.

ఆ గ్రామానికి రోడ్డు, పాఠశాల మంజూరు

- సోలబొంగు విద్యార్థుల కష్టాలపై కదిలిన అధికారులు
- 'ప్రజాశక్తి' కథనాలపై అంతటా చర్చ

ప్రజాశక్తి - అనంతగిరి (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ పరిధి సోలబొంగు గిరి గ్రామానికి చెందిన 12 మంది విద్యార్థులు చదువు కోసం నాటు పడవపై రైవాడ జలాశయం మీదుగా ప్రయాణం చేస్తూ అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం తామరబ్బ ఎంపిపి పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారన్న విషయమై ప్రజాశక్తి దినపత్రిక మెయిన్ పేజీలో 'చదువుకోవాలంటే పడవెక్కాల్సిందే' శీర్షికతో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గిరిజన సంక్షేమ, విద్యాశాఖ అధికారులు సోలబొంగు గ్రామానికి శనివారం కదిలివెళ్లారు. దేవరాపల్లి మండలం వీరభద్రపేట నుండి సోలబొంగు గ్రామం వరకూ రూ.మూడు కోట్లతో గ్రావెల్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రోడ్డు పనులను స్థానిక గ్రామ పెద్దలు డిప్పల దేముడు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావు నాయుడు, అల్లూరి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ వేణుగోపాల్, సర్వ శిక్ష అభియాన్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.స్వామి నాయుడు మాట్లాడుతూ.. సోలబొంగుకు చెందిన 13 మంది పిల్లలు తామరబ్బ పాఠశాలలో చదువుతుండగా మరో నలుగురు బడి మధ్యలో మానేసినట్లు గుర్తించామన్నారు. ఈ విషయాన్ని అల్లూరి కలెక్టర్‌కు తెలపగా ఒకటి, రెండో తరగతి చదువుతున్న ఎనిమిది మంది కోసం అక్కడే చదువుకోవడానికి వీలుగా ఎస్ఆర్ఎస్ఇసి (నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్)ను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారన్నారు. ఈ క్రమంలో ఒక విద్యావలంటీరును తక్షణం నియమించి, ఆ సెంటర్‌ను వారు ప్రారంభించారు మిగిలిన వారిలో 3 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న ఐదుగురు బాల, బాలికలను పినకోట, జీనబాడులోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ సంక్షేమ పాఠశాలలో చేర్పించడానికి కలెక్టర్ అనుమతినిచ్చారు.



సోలబొంగు గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న అల్లూరి, అనకాపల్లి జిల్లాల అధికారులు

అంతేకాకుండా మధ్యలో బడి మానేసిన నలుగురును పినకోటలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలని ఆదేశించారు. మంత్రి లోకేష్ ఆదేశాలతో సోలబొంగి గ్రామానికి చేరుకోవడానికి అధికారులు అష్టకష్టాలు పడ్డారు. బల్లిపురం నుంచి సుమారు రెండు గంటల సేపు అడవిలో నడిచి అన్ని ఇళ్ల వద్దకూ చేరుకున్నారు. అనకాపల్లి డిఇఒ అప్పారావు నాయుడు తదితరులతో కూడిన బృందం నాటు పడవలో గ్రామానికి చేరుకుంది. తమ సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపడంతో గిరిజనులు థింసా నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు.

గిరిజనులు విద్యాభ్యాసానికి దూరం కారాదు : ఎస్‌టి కమిషన్ చైర్మన్

టీచర్లను కేటాయించకపోవడంతో అల్లూరి జిల్లాలో గిరిజన పాఠశాలలు మూతపడ్డాయన్న అంశమై ప్రజాశక్తిలో ఈ నెల 27న 'గిరిజన విద్య పట్టదా ?' శీర్షికన మెయిన్ పేజీలో వచ్చిన కథనంపై రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి.శంకరరావు స్పందించారు. గిరిజన విద్యార్థులు విద్యావకాశాలు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అరుకు మండలంలో లోతేరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో అత్యధికంగా పాఠశాలలు టీచర్ లేక మూతపడ్డాయని, దీనిపై దృష్టి పెట్టాలని ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలకు విద్యాశాఖ అధికారులు వెళ్లాలన్నారు. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమైనందున విద్యార్థులు పాఠశాలలకు వచ్చి చదువుకునేలా చూడాలన్నారు. వెంటనే అవసరమైన చోట ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలన్నారు.

మా బడిని వేరే స్కూల్లో విలీనం చేయొద్దు

- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనలు

ప్రజాశక్తి- యంత్రాంగం

మా బడిని వేరు స్కూల్లో విలనం చేయొద్దు– తమ పిల్లలకు చదువును దూరం చేయవద్దంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనలు దిగారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రూరల్ మండలం వేడాం ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలో కలిపారు. ఫలితంగా వేడాం ప్రాథమిక పాఠశాలలో కేవలం ఎనిమిది మంది విద్యార్థులు మాత్రమే మిగిలారు. దీంతో తమ పిల్లలను బడికి పంపమనీ, బడిని మూసేయాలంటూ శుక్రవారం బడి ముందు ముళ్లకంపలు వేశారు. విషయం తెలుసుకున్న ఎంఇఒ భువనేశ్వరి శనివారం పోలీసు బలగాలతో గ్రామం వద్దకు చేరుకుని గ్రామస్తులను ఒప్పించే ప్రయత్నం చేశారు. వినకుంటే కేసులు పెడతామని హెచ్చరించారు. దీంతో గ్రామస్తులు వారిపై తిరగబడ్డారు.



వేడాం గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఇఒ

కేసులు మాకు కొత్త కాదని గతంలో జరిగిన ఉదంతాలను ఉదహరించారు. సత్యవేడు మండలం పేరడం గ్రామస్తులు సత్యవేడు – ఊత్తుకోట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పిల్లలు అధిక సంఖ్యలో ఉన్న 3, 4, 5 తరగతులను మదనంబేడు పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు. పాఠశాల దూరం కావడంతో తాము స్కూలుకు పంపించే పరిస్థితి లేదని తల్లిదండ్రులు వాపోయారు. రోడ్డుపై బైఠాయించడంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం కోడూరు యుపి పాఠశాలను ఇటీవల బేసిక్ ప్రైమరీ పాఠశాలగా మార్చారు. దీంతో 6, 7, 8 తరగతుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ నెల 12 నుంచి తమ స్కూల్‌ను ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగించాలంటూ అధికారులకు వినతిపత్రాలు అందిస్తూ పాఠశాల వద్ద ప్రతిరోజూ నిరసన చేపడుతున్నారు. రెండు వారాలుగా 6, 7, 8 తరగతుల విద్యార్థులు సుమారు 20 మంది ప్రతిరోజూ స్కూల్‌కు వస్తూ హాజరు వేయించుకుంటున్నారు. శనివారం కూడా రోజు మాదిరిగా స్కూల్‌కు వచ్చిన విద్యార్థులను తరగతి గదుల్లోకి రానీయకుండా హెచ్‌ఎం బయటకు పంపించివేశారు.

మహాన్యూస్ ఛానెల్ కార్యాలయంపై బిఆర్ఎస్ దాడి

- పలువురు నేతల ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై తప్పుడు కథనాలు ప్రసారం చేశారంటూ కొంతమంది యువకులు శనివారం హైదరాబాద్‌లోని ఆ ఛానల్ కార్యాలయంపై దాడి చేశారు. ఆవరణలో పార్కింగ్ చేసిన కార్ల అద్దాలను ధ్వంసం చేశారు. కార్యాలయంలోకి చొరబడి అద్దాలు, కంప్యూటర్లు ,కెమెరాలను ధ్వంసం చేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన పలువురు సిబ్బందిపై కూడా చేయి చేసుకున్నారు. ఈఘటనలో పలువురికి గాయాలయ్యాయి. బిఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్‌ను శనివారం రాత్రి తెలంగాణ భవన్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ తీవ్రంగా ఖండించింది. దాడులకు పాల్పడిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. మహాన్యూస్ టివి ఛానెల్‌పై దాడి ఘటన నేపథ్యంలో..ఛానెల్ కార్యాలయాన్ని వివిధ పార్టీల నేతలు సందర్శించారు.

దాడి గర్హనీయం : చంద్రబాబు, పవన్‌కల్యాణ్

హైదరాబాద్‌లోని మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఖండించారు. మీడియా సంస్థలు ప్రసారం చేసే వార్తలు, కథనాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే వాటిని తెలియజేయడానికి నిర్దిష్టమైన ప్రజాస్వామ్యమైన పద్ధతులు ఉంటాయన్నారు.

'బొత్స' ఉత్తరాంధ్ర ద్రోహి

- టిడిపి నేత కళా వెంకట్రావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఉత్తరాంధ్ర ద్రోహి అని ఎమ్మెల్యే కళా వెంకట్రావు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పేరుకే ఉత్తరాంధ్ర నాయకుడు అని, వైసిపి పాలనలో ఒక్క పరిశ్రమనూ ఈ ప్రాంత జిల్లాలకు తీసుకొచ్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో టిసిఎస్, కాగ్నిజాంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్తరాంధ్రకు తీసుకొచ్చారని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ విద్వేశాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడమే వైసిపికి, ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు వచ్చిన విద్య అని విమర్శించారు.

గ్రీవెన్స్ నిర్వహించిన మంత్రులు అనిత, అనగాని

టిడిపి కార్యాలయంలో హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, మాజీ ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు శనివారం గ్రీవెన్స్ నిర్వహించారు. కార్యాలయానికి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు.

అడ్వకేట్స్ ట్రైనింగ్ అకాడమీకి 'ప్రకాశం' పేరు పెట్టాలి

- బార్ కౌన్సిల్ తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో అడ్వకేట్స్ స్పెషల్ ట్రైనింగ్ అకాడమీని ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల స్టేట్ బార్ కౌన్సిల్ హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించింది. ఏర్పాటు చేయబోయే న్యాయవాదుల ప్రత్యేక శిక్షణ అకాడమీకి ప్రముఖ న్యాయవాది, సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి సిఎం, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పేరు పెట్టాలని రాష్ట్రానికి విజ్ఞప్తి చేస్తూ శనివారం రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎన్ ద్వారకనాథరెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది.

న్యాయవాదుల అకాడమీకి 'ప్రకాశం పంతులు స్పెషల్ ట్రైనింగ్ అకాడమీ ఫర్ అడ్వకేట్స్' పేరు పెట్టాలని కోరింది. లేనిపక్షంలో తెలుగు రాష్ట్రాల నుంచి సుప్రీంకోర్టుకు తొలి ప్రధాన న్యాయమూర్తిగా చేసిన జస్టిస్ కోకా సుబ్బారావు పేరునైనా పెట్టాలంది. ప్రకాశం లేదా కోకా ఇద్దరిలో ఒకరి పేరు పెట్టాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

ఇండో అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను తిరస్కరించాలి

రైతు సంఘాల నేతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇండో అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను తిరస్కరించడం ద్వారా దేశీయ రైతాంగానికి రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల రాష్ట్ర కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల కోసం పంటలు పండే లక్షలాది ఎకరాలను ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం రాష్ట్ర రైతు సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమ్మె, హర్తాళ్‌ను విజయవంతం చేయాలని కోరుతూ జులై 2న అనకాపల్లి, 4న కర్నూలులో జరిగే ప్రాంతీయ రైతు కార్మిక సంఘాల సమావేశాలను జయప్రదం చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. వడ్డే మీడియాతో మాట్లాడుతూ.. జులై 9న జాతీయ కార్మిక సంఘాలు, రైతు సంఘాలు తలపెట్టిన హర్తాళ్‌ను జయప్రదం చేయాలన్నారు. ఈ ఏడాది అన్ని పంటల ధరలు పడిపోయి రైతాంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. రైతులు నష్టపోవడానికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేనన్నారు. మద్దతు ధరల విధానం లేకపోగా, పంటల కొనుగోలు వ్యవస్థ మొత్తం కార్పొరేట్ కంపెనీలు, వ్యాపారుల వశం అవుతోందన్నారు. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ బహుళ సహకార సంస్థల చట్టం పేరుతో మొత్తం రైతులను కార్పొరేట్ల హస్తగతం చేయడానికి రైతు వ్యతిరేక విధానాలను రూపొందించిందన్నారు. ఈ విధానాల


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఫలితంగానూ రైతాంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, వీటిని వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వడ్డే డిమాండ్ చేశారు.

రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, సెకీ, యాక్సెస్ లాంటి సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం, పొగాకు, కోకో, శనగ, మినుములు పంటల కొనుగోలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తోందన్నారు. మామిడి పంటను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి అమలు పరచకపోవడంతో మామిడి రైతులు తమ తోటలను నరికేస్తున్నారని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి జమలయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ అప్పులతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతాంగాన్ని కాపాడాలని, కేరళ తరహా రుణ ఉపశమన చట్టం తెచ్చి రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల అన్ని రకాల పంట రుణాలను రద్దు చేయాలన్నారు. కేరళ తరహా రుణ ఉపశమన చట్టం తెచ్చి అన్ని రకాల పంట రుణాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అఖిల భారత కిసాన్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎం వెంకటరెడ్డి మాట్లాడుతూ.. చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించి చెరకు రైతులను ఆదుకోవాలని, పాల రైతులకు లీటరుకు రూ.10 చొప్పున బోనస్ ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 కూలి పెంచాలని డిమాండ్ చేశారు. కిసాన్ సంఘటన్ రాష్ట్ర కన్వీనరు మరీదు ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. గత శతాబ్దకాలంగా కార్మిక వర్గం సాధించుకున్న కార్మిక అనుకూల చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్‌కోడ్‌లు ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు యు వీరబాబు, ఎఐకెఎస్ రాష్ట్ర నాయకులు కాసాని గణేష్‌బాబు పాల్గొన్నారు.



చెరువుల వద్ద నినాదాలు చేస్తున్న పేదలు, సిపిఎం నేతలు

సింగనపూడిలో భూస్వాధీనోద్యమం

- మా భూముల జోలికొస్తే ఊరుకునేది లేదు
- ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యుల హెచ్చరిక

ప్రజాశక్తి - మండవల్లి (ఏలూరు జిల్లా)

సింగనపూడి ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ భూములు మావే.. లీజు ఇవ్వకుండా అక్రమంగా అనుభవిస్తున్న లీజుదారులు మా భూముల నుండి వెంటనే తప్పుకోవాలి' అంటూ ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యులు తమ భూములను సిపిఎం ఆధ్వర్యంలో శనివారం స్వాధీనం చేసుకున్నారు. తొలుత సింగనపూడి గ్రామంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం నుంచి దళితులు, ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు ఎర్రజెండాలతో సొసైటీ భూముల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫీల్డ్ లేబర్ సొసైటీ ముందు భూములు స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించి, ఎర్రజెండాలను ఎగరవేసి సొసైటీ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ... లీజు పేరుతో సొసైటీ భూములను అక్రమంగా అనుభవిస్తున్న కైకలూరుకు చెందిన పెత్తందారుడు మాడపాటి కృష్ణ ప్రసాద్ నుంచి దళితులైన సింగనపూడి ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యులకు రక్షణ కల్పించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా సొసైటీ సభ్యులకు లీజు చెల్లించకుండా దళితులపై దౌర్జన్యం చేస్తున్న కృష్ణప్రసాద్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, లీజు సొమ్ము వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. దళితుల భూపోరాటానికి సిపిఎం అండగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమాన్నుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.మహంకాళిరావు, ఎంఆర్‌పిఎస్ నాయకులు వై.దానియేలు, పి.ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో సింగనపూడి ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కె.జగదీష్, కార్యదర్శి ఉచ్చుల సుధీర్‌కుమార్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇ-స్టాంపు కుంభకోణంలో ముగ్గురు అరెస్టు

- 15851 బాండ్లు విక్రయం
- పరిశీలించిన 438లో రూ.25.50 లక్షల అవకతవకలు
- అనంత ఎస్‌పి పి.జగదీశ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా కల్యాణదుర్గం కేంద్రంగా జరిగిన ఇ-స్టాంపు ట్యాంపరింగ్ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. తమకు ఇప్పటి వరకు అందిన ఫిర్యాదుల మేరకు 438 ఇ-స్టాంపులు పరిశీలించగా రూ.25.50 లక్షలు అవకతకవలు జరిగినట్టు గుర్తించామని ఎస్‌పి జగదీశ్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను అనంతపురంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌సి ఇన్‌ఫ్రా సంస్థ ఎజిఎం సతీష్ ఈ నెల 25న ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. కల్యాణదుర్గంలో మీసేవ నిర్వహిస్తున్న బాబు అలియాస్ బోయ యర్రప్ప స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా ఇ-స్టాంపులను జారీ చేసే ఏజెన్సీని తన భార్య కట్టా భార్గవి పేరుతో లైసెన్స్ పొందారు. కేంద్రంలో ఎస్‌ఆర్‌సి సంస్థతోపాటు దాని సబ్సిడరీ సంస్థ అయిన సూరజ్ ఇన్‌ఫ్రా, నియో కన్‌స్ట్రక్షన్ కంపెనీలకు సంబంధించి ఇ-స్టాంపులను ఈ కేంద్రంలోనే కొనుగోలు చేశారు. మూడు సంస్థలు కలిసి మొత్తం 438 స్టాంపులను కొనుగోలు చేశారు. వీటికి సంబంధించి మొత్తం రూ.32 లక్షలను మూడు సంస్థలు మీసేవా బాబుకు చెల్లించారు. మీ సేవా బాబు రూ.6.05 లక్షలు మాత్రమే ప్రభుత్వానికి జమ చేసి తక్కినవి డినామినేషన్‌లో ఫొటోషాప్ ద్వారా మార్ఫింగ్ చేసి రూ.25.50 లక్షలు ప్రభుత్వానికి చెల్లించకుండానే నొక్కేసినట్టు తమ విచారణలో తేలిందని ఎస్‌పి తెలిపారు. మీసేవా బాబు లైసెన్స్ పొందిన 2022 నుంచి ఇప్పటి వరకు చూస్తే ఈ కేంద్రంలో 15,821 ఇ-స్టాంపులను అనేక మంది పొందారు.. వీటికి సంబంధించి రూ.32,80,705 మాత్రమే స్టాక్ హోల్డింగ్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు చేరిందని, పై మూడు సంస్థలు కాకుండా తక్కిన వారు ఇక్కడ కొనుగోలు చేసి వాటిల్లోనూ అవకతవకలు జరిగి ఉండే అవకాశముందని తెలిపారు. దీనిపై ఫిర్యాదులొస్తే వాటినీ విచారిస్తామని ఎస్‌పి తెలియజేశారు. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన బోయ యర్రప్పతోపాటు, మోహన్‌బాబు, భువనేశ్వర్‌లను శనివారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్టు తెలిపారు. వారి బ్యాంకు ఖాతాలను కూడా పరిశీలించగా లైసెన్స్ పొందినప్పటి నుంచి ఇప్పటి వరకు రెండు కోట్ల రూపాయల వరకు లావాదేవీలు జరిగినట్టు గుర్తించామని తెలిపారు. తదుపరి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా విచారణ ఉంటుందని ఆయన తెలిపారు. పాయింట్ ఆఫ్ జ్యూడిషన్ కింద ఈకేసును కళ్యాణదుర్గంకు బదిలీ చేసి విచారిస్తున్నట్టు ఎస్‌పి జగదీష్ వివరించారు.

'ఉచిత' ఖర్చును ఆర్‌టిసికి సమకూర్చాలి

- ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అదే సమయంలో ఉచితానికి అయ్యే ఖర్చును నెలనెలా ఆర్‌టిసికి ప్రభుత్వం చెల్లించాలని ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ కోరింది. దీనిపై శనివారం నాయకులు ఎస్‌కె జిలానీ బాషా, సిహెచ్ సుందరయ్య, ఎం అయ్యప్పరెడ్డి ప్రకటన విడుదల చేశారు. ఉచిత బస్సు పథకం మహిళల పురోగతికి, స్వావలంభనకు, రాష్ట్రంలో విద్యార్థినుల చదువుకు తోడ్పడుతుందని అన్నారు. ఉచిత బస్సు ప్రవేశపెట్టే ముందు ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలతో చర్చించాలని వారు కోరారు. ఇప్పుడున్న బస్సుల కంటే రాష్ట్రంలో మరో రెండు రెట్ల బస్సులు అవసరం అవుతాయని, కనీసం 30 వేల బస్సులు నడపాల్సి వస్తుందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో బస్సులను విద్యుత్ బస్సులుగా మార్చడం తక్షణం సాధ్యం కాదన్నారు. ప్రజల అవసరాలు తీరాలంటే డీజిల్ బస్సులు మరికొన్ని సంవత్సరాలు నడపాలని కోరారు. ఆర్‌టిసి నేరుగా విద్యుత్ బస్సులు నడిపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటును అందించాలని, ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే పథకాలు సక్రమంగా అమలు జరగవని పేర్కొన్నారు. యాజమాన్యం 7,500 మంది సిబ్బందిని నియమించాల్సి వస్తుందని ప్రభుత్వానికి పంపిన నివేదికను వెంటనే ఆమోదించాలని కోరారు. డ్రైవర్, కండక్టర్, మెకానికల్, క్లరికల్ సిబ్బంది నియామకం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ బస్సుల పేరుతో ఆర్‌టిసి ప్రైవేటీకరణ చర్యలను ప్రభుత్వం విరమించాలని కోరారు.

కరోనాతో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు

- ఎపి జెఎసి అమరావతి విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కోవిడ్ సమయంలో జిల్లా పరిషత్ స్కూల్స్‌లో పనిచేస్తూ మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద జడ్‌పి పరిధిలో కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని ప్రభుత్వానికి ఎపి జెఎసి అమరావతి విజ్ఞప్తి చేసింది. విజయవాడ లెనిన్ సెంటర్ రెవెన్యూ భవన్‌లో అమరావతి జెఎసిలోని అన్ని సంఘాలతో కలిసి శనివారం నిర్వహించిన సమావేశానికి జిల్లా అధ్యక్షులు కనపర్తి సంగీతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వంలోని ప్రతి శాఖలో వేల సంఖ్యలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. కరోనా సమయంలో ప్రజలతో పాటు ప్రభుత్వ వైద్యులు, టీచర్లు, ఉద్యోగులు మరణించారని, వీరిలో 2,744 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వారిలో 1,488 మందికి ఉద్యోగాలు జిల్లా కలెక్టర్లు కల్పించాలరని, మిగిలిన వారికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో జడ్‌పిల పరిధిలో మరణించిన టీచర్ల విషయంలో మెమో 04.12.2023ను సవరించి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఖాళీలున్న ఇతర ప్రభుత్వ శాఖల్లో కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, ఎపి జెఎసి అమరావతి మహిళా విభాగం ఛైర్మన్ పారె లక్ష్మి, ఎపిఆర్‌ఎస్‌ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, సిటీ జెఎసి ఛైర్మన్ రవి ప్రసాద్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుబాబు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో బ్లాస్ట్ ఫర్నేస్ - 3ని తిరిగి ప్రారంభించడం అభినందనీయమని, కానీ ప్లాంట్‌ను కాపాడాలంటే విశాఖ స్టీల్‌కు క్యాప్టివ్ మైన్స్‌ను కేంద్ర ప్రభుత్వం కేటాయించడమే సరైన పరిష్కారమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ అన్నారు. కనీసం సెయిల్‌లోనైనా ప్లాంట్‌ను విలీనం చేయాలని కోరారు. ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రయత్నాలను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విశాఖలోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కావాలనే క్యాప్టివ్ మైన్స్ ఇవ్వకుండా స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతోందన్నారు. సొంత గనులు లేనందువల్ల ఏటా సుమారు రూ.4 వేల కోట్లను విశాఖ స్టీల్‌ప్లాంట్ అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని తెలిపారు. ప్లాంట్‌లోని ఉత్పత్తి విభాగాల ఆపరేషన్, మెయింటెనెన్స్‌ను కేంద్రం ప్రయివేట్ కంపెనీలకు అప్పగించాలని నిర్ణయించిందని, దీనిలో భాగంగానే సింటర్‌ప్లాంట్, ఆర్ఎంహెచ్‌పి విభాగాల పనులను ప్రయివేట్ కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ఆసక్తిగల కాంట్రాక్టర్ల నుంచి జూలై 12 నాటికి టెండర్లను ఆహ్వానించిందని తెలిపారు. ఈ విధంగా స్టీల్‌ప్లాంట్‌ను 13 విభాగాలుగా చేసి అన్నింటినీ ప్రయివేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడానికి పూనుకుందన్నారు. కాంట్రాక్టర్లు తమ లాభాల కోసమే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నడిపిస్తారని తెలిపారు. ఇప్పటికే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తారాపూర్ ప్రైవేట్ లిమిటెడ్



కంపెనీని మార్కెటింగ్ విభాగంలో నడిపిస్తున్నారన్నారు. మహారాష్ట్రకు చెందిన ఈ కంపెనీ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అండతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అడుగుపెట్టిందని తెలిపారు. ఉత్పత్తి విభాగాలను కాంట్రాక్టర్లకు అప్పగించే విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినప్పటి నుంచి కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు ముఖద్వారం వద్ద రిలే నిరాహార దీక్షలు 1583 రోజులపాటు సాగాయన్నారు. ఈ నెల 12న వర్షానికి దీక్షా శిబిరం కూలిపోయిందని, అప్పటి నుంచి ఈ శిబిరంలో ఎలాంటి నిరాహారదీక్షలూ జరగకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని తెలిపారు. మే 20 నుంచి విశాఖ స్టీల్‌లో వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులు జరిపిన నిరవధిక సమ్మెను దుర్మార్గంగా అణిచివేశారన్నారు. సమావేశంలో పోరాట కమిటీ కన్వీనర్లు నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న షర్మిల

ఎన్నికల హామీలను విస్మరించిన ప్రభుత్వం

- పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పాలన సాగిస్తోందని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల అన్నారు. కాకినాడలో ఆమె శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు హామీలను అమలు చేయడంలేదన్నారు. తల్లికివందనం పథకంలో 87 లక్షల మంది అర్హులుంటే 60 లక్షల మందికి మాత్రమే ఇచ్చారని తెలిపారు.

గతంలో కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన జగన్.. రాజకీయ స్వార్థం కోసం బిజెపికి తొత్తుగా మారారని విమర్శించారు. నేడు టిడిపి కూటమి సర్కారు కూడా అదే బాటలో పయనిస్తోందని తెలిపారు. పోలవరం ఎత్తు తగ్గిస్తామని కేంద్రం ప్రకటించినా.. రాష్ట్ర ఎంపీలు ఒక్క మాట కూడా మాట్లాడటంలేదన్నారు. జగన్ హయాంలో ఐదేళ్లలో ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం వేస్తే కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రూ.17 వేల కోట్ల భారాలను మోపిందని విమర్శించారు. ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

జిడిపికి వ్యవసాయం దన్ను

- 2023-24లో 7 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముఖగా ఉన్న వ్యవసాయ రంగం స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)కి ప్రధాన మద్దతును అందించింది. ఆర్థిక సంవత్సరం 2023-24లో ఈ రంగం 7 శాతం వృద్ధితో రూ.29.49 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తిని నమోదు చేసిందని ప్రభుత్వ గణంకాలు తెలిపాయి. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరం 2022-23లో రూ.27.56 లక్షల కోట్ల విలువను నమోదు చేసింది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా రిపోర్ట్ ప్రకారం.. వ్యవసాయం, పశుసంవర్ధకం, ఫిషరీస్, అటవీ రంగాల సమిష్టి ఫలితంగా ఈ వృద్ధి సాధ్యమయ్యింది.

విభాగాల వారీగా పరిశీలిస్తే వ్యవసాయ రంగం ఒక్కటే రూ.22.73 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తిని అందించింది. ఇది మొత్తం ఉత్పత్తిలో ప్రధాన భాగం. పశుసంవర్ధక రంగం రూ.4.12 లక్షల కోట్లు, ఫిషరీస్ రంగం రూ.1.62 లక్షల



కోట్లు, అటవీ రంగం రూ.1.02 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తిని సమకూర్చాయి. ఈ రంగాలన్నీ కలిసి దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం కీలక పాత్రను మరోసారి నొక్కి చెప్పాయి. మొత్తం జిడిపిలో వ్యవసాయ రంగం వాటా 18 శాతంగా ఉంది. వ్యవసాయాన్ని చిన్న చూపు చూసే కేంద్ర ప్రభుత్వానికి ఈ గణంకాలు కనువిప్పు కావాలని నిపుణులు సూచిస్తున్నారు.

సవాళ్లు..

ఈ స్థాయిలో వృద్ధి ఉన్నప్పటికీ వ్యవసాయ రంగం ఇంకా అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని నివేదిక సూచించింది. వాతావరణ మార్పులు, అనియత వర్షపాతం, నీటి కొరత, మార్కెట్ ధరలలో హెచ్చుతగ్గులు రైతుల ఆదాయంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఎరువులు, విత్తనాలు, కీటక నాశినులు తదితర ఇన్‌పుట్ ఖర్చులు పెరగడం కూడా రైతులకు ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తోంది. ఈ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు. రైతులకు మెరుగైన నీటిపారుదల సౌకర్యాలు, రుణ సౌలభ్యం కల్పించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయవచ్చని భావిస్తున్నారు.

నూతన విక్రేతలకు ఫ్లిప్‌కార్ట్ మద్దతు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

తమ ఇ-కామర్స్ వేదికలో విక్రేతలకు వృద్ధి ఆధారిత మద్దతును పెంపొందించడం కొనసాగిస్తామని ఫ్లిప్‌కార్ట్ మార్కెట్ ప్లేస్ విభాగ సీనియర్ డైరెక్టర్ కపిల్ తీరాని తెలిపారు. సౌకర్యవంతమైన రీతిలో ఆన్‌బోర్డింగ్ మద్దతు, మెరుగైన ఉత్పత్తుల ఆవిష్కరణ, సరళీకృత ధరల ప్రక్రియలు సహా ఆన్‌లైన్ వ్యాపారాన్ని మరింత అనుకూల విధానాన్ని అవలంభిస్తున్నామన్నారు. ముఖ్యంగా తొలిసారి విక్రేతలకు న్యూ సెల్లర్ సక్సెస్ ప్రోగ్రామ్ ద్వారా ప్రత్యేక మద్దతును అందిస్తున్నామన్నారు. కార్యకలాపాలను ప్రారంభించిన మొదటి 60 రోజుల్లో వారికి మార్గనిర్దేశం చేస్తోన్నామన్నారు.

హ్యుందాయ్ మాన్సూన్ సర్వీసు క్యాంప్

గూర్‌గావ్ : హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ దేశవ్యాప్త మాన్సూన్ సర్వీస్ క్యాంప్‌ను ప్రకటించింది. ఇందులో హ్యుందాయ్ కార్లకు సంబంధించి 70 తనిఖీలను చేపట్టనున్నట్లు వెల్లడించింది. విడిభాగాలు, లేబర్, విలువ ఆధారిత సేవలపై ప్రత్యేక డిస్కౌంట్లు అందిస్తున్నట్లు తెలిపింది. జూన్ 25 నుంచి జులై 20 వరకు ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయని హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ తెలిపారు. వాహనాలు వర్షాకాలానికి సిద్ధంగా ఉన్నాయని నిర్ధారించడం ద్వారా వినియోగదారులకు పూర్తి భరోసాను అందించడానికి ఈ క్యాంపెయిన్‌ను రూపొందించామన్నారు.

9న సామ్‌సంగ్ నూతన ఫోల్డబుల్ ఫోన్ల విడుదల


న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ జులై 9న న్యూయార్క్‌లోని బ్రూక్లిన్‌లో తన నూతన ఫోల్డబుల్ ఫోన్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. మెరుగైన పనితీరు, స్పష్టమైన చిత్రాలను ఒడిసిపట్టే కెమెరాలు, ఎఐ ఫీచర్లు ఉంటాయని పేర్కొంది. తదుపరి తరం గెలాక్సీ పరికరాలు కొత్త ఎఐ -ఆధారిత ఇంటర్‌ఫేస్ చుట్టూ ఆవిష్కరణలు ఉంటాయని తెలిపింది.

రేపటికే సామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో గడువు..

దేశంలోని యువ ఆవిష్కర్తలకు ఆర్థిక మద్దతును అందించే సామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో గడువు సోమవారంతో ముగియనుంది. వినూత్న ఆవిష్కరణలు కలిగిన వారు జూన్ 30 లోపు దరఖాస్తు చేసుకుని రూ.1 కోటి బహుమతి గెలుచుకోవచ్చని ఆ సంస్థ సూచించింది.

వారెన్ బఫెట్ రూ.51వేల కోట్ల విరాళం

- గేట్స్ ఫౌండేషన్‌కు కేటాయింపు



వాషింగ్టన్ : ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒక్కరైన వారెన్ బఫెట్ సామాజిక సేవ కార్యక్రమాలకు కోసం భారీగా విరాళం ప్రకటించారు. ఇందులో భాగంగా మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ నిర్వహిస్తున్న గేట్స్ ఫౌండేషన్‌కు ఏకంగా 6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.51వేల కోట్లు) విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తానికి విలువ చేసే బెర్క్‌షైర్ హాత్ వే షేర్లను కేటాయించారు. ఒక్క ఏడాదిలో ఇంత పెద్ద మొత్తం విరాళంగా ఇవ్వడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ మొత్తాన్ని గేట్స్ ఫౌండేషన్‌తో పాటు, ఆయన కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలకు ఇస్తున్నట్లు ప్రకటించారు. వారెన్ బఫెట్ 152 బిలియన్ డాలర్ల (రూ.13 లక్షల కోట్లు) నికర విలువతో ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద సంపన్నుడిగా ఉన్నారు. తాజా విరాళంతో ఆయన ఆరో స్థానానికి తగ్గిపోయారు.

ఆగస్టు నుంచి పోస్టాఫీస్‌లలో డిజిటల్ పేమెంట్స్



న్యూఢిల్లీ : ఈ ఏడాది ఆగస్టు నుంచి అన్ని పోస్టాఫీస్‌ల్లో డిజిటల్ పేమెంట్స్‌ను స్వీకరించనున్నారు. పోస్టల్ విభాగంలో ఐటి నూతన మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా డిజిటల్ చెల్లింపులకు వీలవుతుందని ఆ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటి వరకు పోస్టాఫీస్‌లు యుపిఐ వ్యవస్థతో అనుసంధానం కాలేదు. ఈ నేపథ్యంలో డైనమిక్ క్యూఆర్ కోడ్ ద్వారా లావాదేవీలు నిర్వహించే విధంగా కొత్త అప్లికేషన్‌ను తెస్తున్నామని పోస్టల్ శాఖ అధికారులు తెలిపారు. ఆగస్టు 1 నాటికి అన్ని పోస్టాఫీసుల్లో ఈ సదుపాయం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే కర్ణాటక సర్కిల్‌లో ప్రయోగాత్మకంగా ఐటి 2.0 కింద డిజిటల్ చెల్లింపులను స్వీకరిస్తున్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- రూ.65 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-కాకినాడ

రాత్రి పూట చోరీలు చేస్తూ తప్పించుకు తిరుగుతున్న అంతర్ జిల్లాల దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు వివరాలను కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి బిందుమాధవ్ శనివారం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం జి.వేమవరం గ్రామానికి చెందిన బొగడ శ్రీను అలియాస్ బట్టి శ్రీను, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన పాశి శేఖర్, ప్రోతంశెట్టి సూర్య భాస్కరరెడ్డి ముఠాగా ఏర్పడి రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్నారు. వీరు ఉమ్మడి తూర్పు గోదావరితో పాటు మరో నాలుగు జిల్లాల్లో జరిగిన 19 చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. తప్పించుకు తిరుగుతున్న వీరిపై ప్రత్యేక నిఘా పెట్టి కాకినాడ రూరల్ సిఐ చైతన్యకృష్ణ, గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్ కుమార్, కరప ఎస్ఐ


చోరీ సొత్తును చూపుతున్న ఎస్‌పి బిందుమాధవ్

టి.సునీత, పోలీసు సిబ్బంది వీరిని శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.65 లక్షల విలువైన 582 గ్రాముల బంగారు ఆభరణాలు, 12.5 కేజీల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని ఎస్‌పి తెలిపారు. వీరిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని ఎస్‌పి బిందుమాధవ్, అదనపు ఎస్‌పి ఎంజెవి భాస్కరరావు అభినందించారు.

సంపాదకీయం


జీరో డోస్!

'ఆరోగ్యం ప్రజల ప్రాథమిక హక్కు. దానిని నిర్లక్ష్యం చేయడమంటే...రేపటి ప్రమాదాలకు పునాది వేయడమే' అంటారో ఆరోగ్యవేత్త. పిల్లలకు సమయానికి రోగ నిరోధక టీకాలు వేయించాలి. నిర్దిష్ట సమయంలో నిర్ణీత వ్యాక్సినేషన్ చేయించాలి. తద్వారా 20 రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి పిల్లల్ని కాపాడుకోగలుగుతాం. బ్యాక్టీరియాల వల్ల కలిగే డిఫ్తీరియా, పెర్ట్యూసిస్, టెటనస్ (డిటిపి)ల నుంచి ఈ వ్యాక్సిన్ రక్షిస్తుంది. పిల్లలు పుట్టిన వెంటనే అందించే వ్యాక్సిన్లు...ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడే రక్షణ కవచాలు. మన దేశంలో 1978లో ఎక్స్‌పాండెండ్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇమ్యూనైజేషన్ (ఈపీఐ)గా ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని దశల వారీగా 1989–90 నాటికి దేశమంతా చేపట్టారు. ఈ వాక్సిన్లను ప్రభుత్వాసుపత్రుల్లో, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇస్తారు. చిన్నప్పుడు స్కూళ్లలో ఒక క్లాసులో టీకాలు వేస్తున్నారంటే, మరో క్లాసులో వాళ్లు పారిపోయేవారు. జ్వరమొస్తుందని తల్లిదండ్రులు కూడా భయపడేవారు. ఇంత అవగాహనా లోపం వున్నప్పటికీ మసూచి వంటి భయంకరమైన వ్యాధులను నిర్మూలించగలిగాం. 'చిన్నారులకు ఆరోగ్య హక్కు మౌలిక హక్కే. దానిని వాయిదా వేయలేం' అంటారు నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి. భారతదేశం ఆరోగ్య రంగంలో అనేక విజయాలు సాధించినా, ఇటీవల వచ్చిన కొన్ని గణాంకాలు కలవర పెడుతున్నాయి.

దేశం ఎంతో పురోగతి సాధించిందని చెప్పుకుంటున్నా...14 లక్షల మందికి పైగా చిన్నారులకు ఎలాంటి టీకాలు వేయలేదని, 'జీరో డోస్' నమోదైందని ది లాన్సెట్ జనరల్ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా రోగనిరోధకత యత్నాల్లో తీవ్రమైన స్తబ్దత నెలకొందని, ముఖ్యంగా భారత్, ఇతర దక్షిణాసియా దేశాల్లో టీకాలకు దూరంగా వున్న లక్షలాది మంది చిన్నారులు ప్రాణాంతకమైన, నివారించదగిన వ్యాధుల బారిన పడే అవకాశం వుందని ఆ నివేదిక హెచ్చరించింది. 1980–2023 మధ్య వ్యాక్సిన్ అందించడంలో పురోగతి వున్నప్పటికీ... 2010 నుంచి ఈ వేగం గణనీయంగా తగ్గిందని అధ్యయనం చెబుతోంది. వలస పాలనలో భారతదేశం అంటురోగాలకు పుట్టిల్లుగా వుండేది. ఆకలి చావులు, అంటువ్యాధులతో లక్షలాదిమంది మృతి చెందేవారు. ఆ స్థాయి నుంచి ఆయుఃప్రమాణాన్ని క్రమంగా పెంచుకోగలిగాం. అయితే, మోడీ అధికారంలోకి వచ్చిన ఈ 11 ఏళ్లలో దేశం అన్ని రంగాల్లో రివర్స్‌లో వెళుతోంది. ఆయుఃప్రమాణం, పేదరికం, సంతోషం, ఆకలి వంటి సూచీల్లో మనం అట్టడుగున వున్నాం. ప్రజలకు అతి ముఖ్యమైన విద్య, వైద్యం ప్రైవేటీకరించడంతో పేదలు మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నారు. ఇటీవల టీవీలో కొన్ని అడ్వర్టయిజ్‌మెంట్లు తరచూ వస్తున్నాయి. భర్త ఫొటో ముందు నిలబడి...'నీకే నువ్వు చచ్చిపోయి హాయిగా వున్నావు. నేను, పిల్లలే ఏడుస్తున్నాం. హెల్త్ ఇన్సూరెన్స్ అన్నా చేశావు కాదు..' అంటూ ఏడుస్తుంటుంది భార్య. ఇంకో దానిలో అనారోగ్యం నుంచి కోలుకున్న ఓ పెద్దాయన...'ఫలానా సంస్థలో ఇన్సూర్ చేయబట్టే ఇవాళ్ల నేను ఆరోగ్యంతో బయటపడ్డాను' అంటూ చిరునవ్వుతో ముక్తాయింపు ఇస్తాడు. ప్రజల్ని ఇటువంటి మైండ్‌సెట్‌లోకి తీసుకెళ్లి, వైద్యం ఒక వ్యాపారం, నీ ఇన్సూరెన్స్ నువ్వు కట్టుకో, నీ ఆరోగ్యం బాధ్యత నువ్వే చూసుకో అని ప్రభుత్వాలు చెప్తున్నాయి.

వ్యాక్సిన్ మహత్తరమైన శాస్త్రీయ పరిశోధన. ప్రజల్ని గడగడ వణికించిన అనేక జబ్బులకి వ్యాక్సిన్‌లు రావడం వల్ల శిశుమరణాలను గణనీయంగా తగ్గించగలిగాం. ప్రభుత్వాలు దీన్నొక ఉద్యమంగా నడిపితేనే ఇది విజయవంతం అవుతుంది. అయితే, ప్రభుత్వం ప్రజారోగ్యం బాధ్యత నుంచి పూర్తిగా వైదొలగడం వల్లే కరోనా సమయంలో దేశం లక్షలాది చావులను చూసింది. ఒకప్పుడు వ్యాక్సిన్‌ల ఉత్పత్తిలో ప్రపంచంలోనే 60 శాతం వరకూ భారత్ ఉత్పత్తి చేసింది. దీనికి కారణం హిందూస్థాన్ యాంటిబయోటిక్స్ వంటి సంస్థలు ప్రభుత్వరంగంలో వుండటం. మోడీ వచ్చిన తర్వాత ఇటువంటి సంస్థలన్నీ మూతబడి, అనేక ప్రైవేటు సంస్థలు పుట్టుకురావడం మన కళ్ల ముందే జరిగిన కఠోర వాస్తవం. ప్రజారోగ్యం, శానిటేషన్, టీకాలు పట్ల శ్రద్ధ పెట్టడం లేదు. మరోవైపు ప్రభుత్వాసుపత్రులు నిర్వీర్యమౌతున్నాయి. ఇదే సమయంలో ప్రజారోగ్యం పట్ల శ్రద్ధ పెట్టిన చైనా...వ్యాక్సిన్‌ల ఉత్పత్తిలో మొదటి స్థానంలో వుంది. క్యూబా పేదరికంలో వున్నప్పటికీ ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టింది. చిన్నారులకు టీకాలు వేయడం అంటే, ఒక ప్రాణాన్నో, ఒక కుటుంబాన్నో కాపాడటం కాదు. సమాజాన్ని రక్షించడం. లాన్సెట్ నివేదిక దేశ ఆరోగ్య రంగానికి పెద్ద హెచ్చరిక.

మహనీయుల మాట



మనిషే చరిత్రను నిర్మిస్తాడు. మనిషి సమకూర్చుకునే ఉత్పత్తి శక్తులే అన్ని రకాల సామాజిక సంబంధాలనూ నిర్ధారిస్తాయి.

- జి.వి. ప్లెఖనోవ్,
రష్యన్ విప్లవకారుడు,
మార్క్సిస్టు సిద్ధాంతవేత్త.

అప్రకటితం ... అంతకన్నా ప్రమాదం !

> ఇంత మీడియా, ఇంత అక్షరాస్యత లేని రోజుల్లోనే ఎమర్జెన్సీని ఓడించిన భారతీయ ఓటర్లు ఈ వ్యవస్థీకృత సనాతనాన్ని కూడా ఎల్లకాలం సహిస్తారనుకోవడం పొరబాటు. 2024 ఎన్నికల్లోనే ప్రజలు బిజెపికి స్వంతంగా మెజార్టీ ఇవ్వలేదని గుర్తుంచుకోవాలి. కాంగ్రెస్‌తో సహా వివిధ పాలక వర్గ పార్టీలలో అనిశ్చిత వైఖరి, అనేక ప్రాంతీయ పార్టీల అవకాశవాద ధోరణులు మారి లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వస్తే 'అప్రకటిత' ప్రమాదాన్ని ప్రతిఘటించడం సాధ్యమే.



తెలకపల్లి రవి

ఎమర్జెన్సీ యాభయ్యవ వార్షికంపై జాతీయ స్థానిక పత్రికలలో, చానళ్లలో వ్యాసాలు, వ్యాఖ్యలు ముంచెత్తుతున్నాయి. అయితే అదేదో గడిచిపోయిన గండం లాగా చెప్పుకుని, అప్పటి పాలక వర్గ నేతలను, చేతలను విమర్శించి వర్తమానాన్ని విస్మరిస్తే అంతకన్నా పొరపాటు ఉండదు. ఎమర్జెన్సీ లేదా అత్యవసర పరిస్థితి యాభయ్యేళ్ల పూర్తిని గుర్తు చేసుకోవడానికి రెండు బలమైన కారణాలు కనిపిస్తాయి. **మొదటిది**–స్వతంత్ర భారత చరిత్రలో ప్రజాస్వామ్యంపై తొలి అతి పెద్ద దాడి అదే గనక. **రెండవది**–ఎమర్జెన్సీ విధించిన ప్రధాని ఇందిరా గాంధీ తర్వాత అతి శక్తివంతుడుగా ఇంకా బలిష్టుడుగా కీర్తనలందుకునే మోడీ ప్రస్తుత ప్రధానిగా వున్నారు గనక. ప్రతి చారిత్రిక ఘట్టం, కీలక పాత్రధారులు రెండుసార్లు ప్రత్యక్షమవుతారన్న హెగెల్ మాటను కాస్త సవరిస్తూ "చరిత్ర పునరావృతమవుతుంది, మొదటిసారి విషాదాంతంగా రెండవసారి బూటకంగా" అంటాడు మార్క్స్. "చరిత్రను మర్చిపోయేవారు దాన్నే పునరావృతం చేసి బలికాక తప్పదు" అంటాడు స్పానిష్ అమెరికన్ రచయిత జార్జి శాంటియానా. అయితే మోడియాగా పేరొందిన బడా మీడియాలో మార్మోగుతున్న ఎమర్జెన్సీ చర్చలో అత్యధిక భాగం అందుకు భిన్నంగా ఉండటంలో ఆశ్చర్యం ఏముంది? ఎమర్జెన్సీ 50 ఏళ్లు అన్నప్పుడు ఇందులో తాజా భాగమైన గత పదకొండేళ్ల మోడీ రాజ్ గురించి తులనాత్మక ప్రస్తావన రావటం లేదు. రాకపోవడం యాదృచ్ఛికం కూడా కాదు. అసలు ఈ తతంగాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నదీ, నియంత్రిస్తున్నదీ మోడీ రాజ్ అయినప్పుడు అంతకన్నా భిన్నంగా ఎలా వుంటుంది? ఎమర్జెన్సీ నేపథ్యం అమలు అనుభవాలపై చాలా వివరాలు వచ్చాయి కనుక పునశ్చరణ అనవసరం. సరిగ్గా ఈ సందర్భంగానే ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే రాజ్యాంగ పీఠిక నుంచి లౌకిక తత్వం, సామ్యవాదం అనే పదాలను తొలగించాలని మరోసారి ప్రతిపాదించటం చూస్తే ప్రస్తుత తతంగం ఉద్దేశమేమిటో ఇట్టే తెలిసిపోతుంది. ఎమర్జెన్సీ నిస్సందేహంగా ప్రజాస్వామ్యానికి ఒక పీడకల. అది గతానికి సంబంధించిన చర్చగా మారిపోతే అప్పుడు ప్రయోజనం ఉండదు. దానికి ముందు, తర్వాత జరిగిన జరుగుతున్న పరిణామాలను కూడా సవ్యంగా గ్రహిస్తేనే ఈ చర్చ ప్రయోజనం నెరవేరుతుంది.

నాడు ఇందిరా గాంధీ నిరంకుశ పోకడలు, ఎమర్జెన్సీ పేరిట పౌర హక్కులపై దాడి, నిర్బంధకాండ ఇవన్నీ తప్పక చెప్పుకోవాల్సిందే. బీహార్‌లో జయప్రకాష్ నారాయణ ఉద్యమం, ఇందిరా గాంధీ ఎన్నిక రద్దు ఈ రెండు అంశాలను ప్రస్తావించిన తర్వాత అరెస్టుల పర్వానికి రావడం మీడియాలో ఎక్కువమంది చేస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్, జనసంఘ్, అలాగే స్వతంత్ర పార్టీ వంటి మితవాద రాజకీయ నేపథ్యం గల నాయకులతో పాటు అప్పటి నక్సలైట్ కార్యకర్తల అరెస్టుల కథనాలూ, జ్ఞాపకాలూ దర్శనమిస్తున్నాయి.

> అప్పట్లో అనేక చోట్ల నిర్బంధ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరగడం ఘోరమే కానీ ఇప్పుడు ఇళ్లలో వ్యక్తులు ఏమి తింటున్నారు? వారి వంటింట్లో ఉన్న ఆహార పదార్థం ఏమిటి? మహిళలు ఏ వస్త్రాలు ధరిస్తున్నారు? ఏ వాహనంలో ఏ జంతువులను తరలిస్తున్నారు? అన్నది పోలీసులను మించి సంఘ పరివారం మనుషులే వేటాడి దాడులు చేస్తున్నారు. ఈ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన విషాదాలు ఎన్నెన్నో. ఆనాడు ఒక వ్యక్తి అధికారపరమైన రాజకీయ నిరంకుశత్వం సాగిన దాన్ని మించి ఇప్పుడు పౌరుల వ్యక్తిగత జీవిత పరిధిలోకి కూడా ఎమర్జెన్సీ ప్రవేశించటం వీటిలో స్పష్టం. ఎమర్జెన్సీలో నిరంకుశత్వం మతాల వారీగా జరిగినట్టు పెద్దగా దాఖలాలు లేవు. కానీ ప్రస్తుత అప్రకటిత పర్వంలో ఒక మతాన్ని, అణగారిన వర్గాలను, స్వతంత్ర భావాలుగల రచయితలను వెంటాడటం పరిపాటి అయ్యింది.



మిస్సింగ్ లింక్స్

కానీ వీరంతా దాటేస్తున్న కీలకమైన మిస్సింగ్ లింక్స్ ఏమిటి? శ్రీమతి గాంధీ నిర్ణయంతో 352వ అధికరణం కింద రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ 1975 జూన్ 25 అర్ధరాత్రి అత్యవసర పరిస్థితి ప్రకటించితే జులై 21న లోక్‌సభలో దాన్ని చట్టబద్ధం చేస్తూ తీర్మానం తీసుకొచ్చారు. ఆ చర్చ ప్రారంభించింది, తీవ్ర నిరసనలతో అత్యవసర పరిస్థితిని సభలో మొదట ఎండగట్టింది సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎ.కె.గోపాలన్. గోపాలన్ ప్రసంగం సైక్లోస్టయిల్ కాపీ అప్పుడు అజ్ఞాతంలో వున్నవారు కూడా గొప్ప ప్రేరణగా భావించారు. ఈ మాట కూడా కొంతమంది రాశారు కానీ గోపాలన్ నాటి సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అన్న ప్రస్తావనే రావడం లేదు. 1971లో కూడా ఇందిర గాలిని తట్టుకుని నిలబడిన ఏకైక పార్టీ సిపిఎం. 1971లో లోక్‌సభలో సిపిఎం కు 25 స్థానాలు ఉంటే జనసంఘ్‌కు వాజ్‌పేయితో సహా 11 స్థానాలు ఉన్నాయి. గత రెండు రోజులుగా ప్రజాశక్తి వ్యాసాల్లో రాసినట్టు 1972 పశ్చిమ బెంగాల్ ఎన్నికల రిగ్గింగ్ నిరంకుశ పాలనకు సంకేతమని సిపిఎం ఇచ్చిన హెచ్చరిక కొంతవరకూ జయప్రకాశ్ నారాయణ తప్ప మరే పాలక పార్టీ చెవికెక్కించుకోలేదు. ఆ పర్యవసానాలను దేశం ఎమర్జెన్సీ రూపంలో అనుభవించాల్సి వచ్చింది. ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా బడా పత్రికలు, లౌకిక పాలక పార్టీల నేతలు నాటి పరిణామాల్లో ప్రధాన వామపక్షమైన సిపిఎం పాత్రను విస్మరించటం గమనార్హం. ఎమర్జెన్సీ కాలంలో సిపిఎం కీలక శక్తిగా ఉన్న చోట్ల సమరశీల కార్యకర్తలు దొరికిన మేరకు పోలీసులు అరెస్టు చేశారు. కాకపోతే తనది అభివృద్ధి నిరోధక ఫాసిస్టు శక్తులపై పోరాటమని చెప్పుకోవడం కోసం ఇందిరా గాంధీ ఆ తర్వాత కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అంతమాత్రాన శ్రీమతి గాంధీ నిరంకుశత్వాన్ని తానే ఓడించినట్టుగా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు ఊరేగడం చెల్లుబాటయ్యేది కాదు. ఆర్‌ఎస్‌ఎస్ కీలక నేత దత్తాత్రేయ దేవరస్ ప్రధానికి జైలు నుంచి లేఖలు రాసి మద్దతు ప్రకటించినప్పటికీ, ఆ లేఖలు పరిణామాలు విస్తారంగా అందుబాటులో ఉన్నప్పటికీ బడా మీడియా వాటిని ఎందుకు ప్రముఖంగా చర్చకు పెట్టడం లేదు? అప్పట్లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ మారు వేషాల కథలతో తెచ్చిన పుస్తకాలకు పెద్ద ప్రచారం వస్తున్నదే కానీ సిపిఎం ప్రజా సంఘాలు క్రమపద్ధతిలో ఆ నిరంకుశత్వంపై చేసిన పోరాటాలు, ఉద్యమాలు, తెచ్చిన సాహిత్యం గురించి చెప్పడంలేదే? ప్రజాశక్తి వారపత్రికగా అప్పట్లో నిర్వహించిన రాజకీయ పాత్ర అమోఘమైనది. ప్రభుత్వాన్ని పొగిడేందుకై వచ్చే కథనాలనే వ్యంగ్య శీర్షికలతో ఇచ్చేది. మోటూరు హనుమంతరావు 'అంజి' పేరుతో ఆ రోజులలో 'రాజు వెడలె' అంటూ సంజయ్ గాంధీ ఆర్భాటంపై రాసిన వ్యంగ్య రచన ఎంతో ఆకర్షించింది. అదే తరహాలో వడ్లమూడి నాగేశ్వరరావు 'రావే రావే రంగీ' పేరిట నృత్య నాటిక రాస్తే ఎమర్జెన్సీలోనే 1976 మే లో విజయవాడలో ప్రజానాట్య మండలి పునరుద్ధరణ సదస్సులో ప్రదర్శించడం ఇంకా గుర్తుంది. ప్రజాశక్తి సెన్సార్ ఆంక్షలను కూడా తట్టుకుని వ్యంగ్య రూపంలో చాకచక్యంగా విలువైన సమాచారాలిస్తూ నిజంగానే ఒక కరదీపికగా పనిచేసింది. ప్రజాస్వామ్యం కోసం పోరాటంలో ప్రజాశక్తి ప్రజా కళలు ఆ విధంగా గొప్ప పాత్ర వహించాయి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఇలా చెప్పుకోవలసిన విశేషాలు మరిన్ని వున్నాయి. మరోవైపున ఆరెస్సెస్ మాత్రం ఇందిరా గాంధీని మంచి చేసుకునేందుకు తంటాలు పడుతూ వచ్చింది. వాజ్‌పేయి పెరోల్‌పై విడుదలై బయటే వుండిపోయారు. ఆ ముచ్చటలేమైనా చర్చకు వస్తున్నాయా?

వ్యక్తిగత అంశాల్లోనూ వేట

ఇవన్నీ గతానికి సంబంధించినవి అనుకుంటే ఇప్పుడు జరుగుతున్న తీవ్ర పరిణామాలైనా మాట్లాడుతున్నదా బడా మీడియా? పత్రికలపై నాటి సెన్సార్, పౌర హక్కుల సస్పెన్షన్ ఘోరమైనవే కానీ ఇప్పుడు కూడా డజన్ల మంది జర్నలిస్టుల పైన దాడులు, మూసివేతలు, అరెస్టులు లేవా? అప్పుడు నిర్బంధానికి గురై ఇప్పుడూ వెంటాడబడుతున్న ప్రబీర్ పుర్కాయస్థ లాంటి వాళ్లను ఎందుకు ముందుకు తేవడం లేదు? అప్రకటిత ఎమర్జెన్సీ అని అంటున్నప్పుడు అదృశ్య ప్రభావాలు ఏమిటో తెలుసుకుంటే ఈ ప్రశ్నలకు సమాధానం సులభంగా దొరుకుతుంది. ఉద్దేశం ఏదైనా ఏదో ఒక రాజ్యాంగ నిబంధన మేరకు విధించబడి ముందో వెనకో సభలో చర్చకు వచ్చింది ఎమర్జెన్సీ. నిరంకుశ ధోరణిలో వచ్చిన 42వ రాజ్యాంగ సవరణ చర్చనూ సిపిఎం దేశవ్యాపితంగా నిర్వహించింది. పుస్తకాలు వేసింది. 1977లో ప్రజలు శ్రీమతి గాంధీని ఓడించాక అవన్నీ వెనక్కు కొట్టగలిగారు. కానీ ఇప్పుడు నోట్ల రద్దు నుంచి లోక్‌సభ ప్రమేయం లేకుండానే జరిగిపోయాయి. ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ చట్ట సవరణతో సహా అతి కీలకమైన విధాన నిర్ణయాలు సమగ్రంగా చర్చకు పెట్టింది లేదు. ఇటీవల పాకిస్తాన్‌తో సాగిన సాయుధ ఘర్షణకు సంబంధించిన నిజానిజాలను, తప్పొప్పులను మాట్లాడుకోవడానికి పార్లమెంట్ సమావేశాలు జరపాలన్నా ఏకపక్షంగా నిరాకరణే ఎదురైంది. అప్పట్లో అనేక చోట్ల నిర్బంధ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరగడం ఘోరమే కానీ ఇప్పుడు ఇళ్లలో వ్యక్తులు ఏమి తింటున్నారు? వారి వంటింట్లో ఉన్న ఆహార పదార్థం ఏమిటి? మహిళలు ఏ వస్త్రాలు ధరిస్తున్నారు? ఏ వాహనంలో ఏ జంతువులను తరలిస్తున్నారు? అన్నది పోలీసులను మించి సంఘ పరివారం మనుషులే వేటాడి దాడులు చేస్తున్నారు. ఈ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన విషాదాలు ఎన్నెన్నో. ఆనాడు ఒక వ్యక్తి అధికారపరమైన రాజకీయ నిరంకుశత్వం సాగిన దాన్ని మించి ఇప్పుడు పౌరుల వ్యక్తిగత జీవిత పరిధిలోకి కూడా ఎమర్జెన్సీ ప్రవేశించటం వీటిలో స్పష్టం. ఎమర్జెన్సీలో నిరంకుశత్వం మతాల వారీగా జరిగినట్టు పెద్దగా దాఖలాలు లేవు. కానీ ప్రస్తుత అప్రకటిత పర్వంలో ఒక మతాన్ని, అణగారిన వర్గాలను, స్వతంత్ర భావాలుగల రచయితలను వెంటాడటం పరిపాటి అయ్యింది. ఇందుకు కారణం దీనికి ఒక మతతత్వ, నిరంకుశ భావజాలం వుండటమే. 'కిస్సా కుర్సీకా' వంటి చిత్రాలను ఎమర్జెన్సీలో ఆటంకపరిచారు కానీ ఇప్పుడు అసలు షూటింగులు మొదలవక ముందు నుంచే వాటిపై దాడులు, దౌర్జన్యాలు సర్వసాధారణమైపోయాయి.

వ్యవస్థీకృత ప్రమాదం

తనను తాను ప్రగతిశీలవాదిగా చూపించుకోవడం కోసం అప్పట్లో శ్రీమతి గాంధీ కొన్ని పరిశ్రమల స్థాపన, జాతీయకరణ వంటి నిర్ణయాలు చేస్తే ఇప్పుడు ఇష్టానుసారం కార్పొరేట్లకు కట్టబెట్టడం చట్టబద్ధంగానే జరిగిపోతున్నది. కరోనా పై పోరాటం లాంటి ఆరోగ్య అంశాల నుంచి అందరూ ఆలోచించే విదేశాంగ విధానం వరకు ఒక వ్యక్తి చుట్టూనే తిరుగుతున్న పరిస్థితి. ఇందిరే ఇండియా అనడం ఎంత తప్పో ఇప్పటికీ చెప్తున్నాము కానీ విశ్వగురు బిరుదు తీసుకొని ప్రపంచానికే మా నేత మార్గదర్శకుడని టముకు వేయడాన్ని ఏమనాలి? గాంధీ కుటుంబాన్ని దర్యాప్తు చేసిన అధికారులను వేధించినట్టు ఎమర్జెన్సీపై నియమితమైన షా కమిషన్ ముందు కేసులు వచ్చాయి. కానీ ఇప్పుడు తమకు నచ్చని ముఖ్యమంత్రులు, కీలక నేతలను త్రిశూల వ్యూహంతో వేటాడటాన్ని చాలాసార్లు న్యాయస్థానాలే కొంతవరకు తప్పు పట్టిన పరిస్థితి. అందువల్ల శ్రీమతి గాంధీ పదవి కాపాడుకోవడం కోసం తెచ్చిన ఎమర్జెన్సీ వ్యక్తిగత స్థాయిలో ఆంతరంగిక ముఠాతో నడిచింది. కానీ ఇప్పుడు కార్పొరేట్ వర్గాలు, మతతత్వ సంస్థలు, అంతర్జాతీయ ద్రవ్య అధిపతుల కీలుబొమ్మలైన ట్రంప్ వంటి వారితో సహా కలగలసి వ్యవస్థీకృత నిరంకుశత్వంగా మోడీ రాజ్ అన్ని విభాగాలనూ జీవన రంగాలనూ మను ధర్మం మార్కెట్ మర్మాలతో శాసించేందుకు చెలరేగిపోతున్నది. ఇంత మీడియా, ఇంత అక్షరాస్యత లేని రోజుల్లోనే ఎమర్జెన్సీని ఓడించిన భారతీయ ఓటర్లు ఈ వ్యవస్థీకృత సనాతనాన్ని కూడా ఎల్లకాలం సహిస్తారనుకోవడం పొరబాటు. 2024 ఎన్నికల్లోనే ప్రజలు బిజెపికి స్వంతంగా మెజార్టీ ఇవ్వలేదని గుర్తుంచుకోవాలి. కాంగ్రెస్‌తో సహా వివిధ పాలక వర్గ పార్టీలలో అనిశ్చిత వైఖరి, అనేక ప్రాంతీయ పార్టీల అవకాశవాద ధోరణులు మారి లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వస్తే 'అప్రకటిత' ప్రమాదాన్ని ప్రతిఘటించడం సాధ్యమే.

★

చిదిమేసినా... అంకురించి.. మహా వృక్షమై...



జి.ఎన్.వి.గోపాలన్

కష్టజీవులను ఏకం చేసి మహా ఉద్యమం చేయాలని కమ్యూనిస్టులు భావిస్తే, మొగ్గలోనే తుంచేయాలని పాలక వర్గాలు తలుస్తుంటాయి. 1946–51 మధ్య చారిత్రాత్మకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని సైనిక బలగాల ద్వారా అణచివేయాలని భావించిన నెహ్రూ ప్రభుత్వం... కమ్యూనిస్టుల పైన, ప్రజలపైన విరుచుకుపడి 4 వేల మంది ప్రాణాలను బలితీసుకుంది. సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించడంతో పార్టీపై నిషేధం విధించారు. రైతాంగ పోరాటానికి అండగా ఆంధ్రాలో కమ్యూనిస్టు పార్టీ వున్నదని, కమ్యూనిస్టులను చెట్లకు కట్టేసి నిర్దాక్షిణ్యంగా పిట్టలను కాల్చినట్టు కాల్చి చంపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోనే 17 మందిని కాల్చి చంపితే, అందులో ఐదుగురు ఒక్క చించినాడ గ్రామంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఆ విధంగా అమరులైన వారిలో చించినాడ తొలి శాఖ సభ్యులు రుద్రరాజు గోపాలరాజు, రుద్రరాజు అయ్యపరాజు, బూసి మునలయ్య, అల్లూరి రామరాజు, బూసి వెంకట్రావు ఉన్నారు. ఈ ఐదుగురిని 1950 ఫిబ్రవరి 22 నుండి జులై 9 మధ్య ఐదు మాసాల లోపే కాంగ్రెస్ భూస్వాముల సహకారంతో పోలీసులు కాల్చి చంపారు. ఇక గ్రామంలో కమ్యూనిస్టు పార్టీని నిర్మూలించామని భూస్వామ్య పాలక వర్గం, పోలీసువారు భావించారు. సరిగ్గా ఈ సమయంలోనే ఇంటర్మీడియట్ పూర్తి చేసి విద్యార్థి నాయకుడిగా ఉన్న చించినాడ గ్రామస్తుడు రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్.ఎస్) ఈ పరిణామాలకు రగిలిపోయి గ్రామంలో ఎర్రజెండా రెపరెపలాడాలని, ప్రజల కష్టాలు తీరాలని కంకణం కట్టుకున్నారు. ఆయనకు కేతా సూర్యారావు తదితరులు తోడయ్యారు. చిదిమేసినా...పార్టీని తిరిగి అంకురింపచేశారు.

> రైతాంగ పోరాటానికి అండగా ఆంధ్రాలో కమ్యూనిస్టు పార్టీ వున్నదని, కమ్యూనిస్టులను చెట్లకు కట్టేసి నిర్దాక్షిణ్యంగా పిట్టలను కాల్చినట్టు కాల్చి చంపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోనే 17 మందిని కాల్చి చంపితే, అందులో ఐదుగురు ఒక్క చించినాడ గ్రామంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఆ విధంగా అమరులైన వారిలో చించినాడ తొలి శాఖ సభ్యులు రుద్రరాజు గోపాలరాజు, రుద్రరాజు అయ్యపరాజు, బూసి మునలయ్య, అల్లూరి రామరాజు, బూసి వెంకట్రావు ఉన్నారు. ఈ ఐదుగురిని 1950 ఫిబ్రవరి 22 నుండి జులై 9 మధ్య ఐదు మాసాల లోపే కాంగ్రెస్ భూస్వాముల సహకారంతో పోలీసులు కాల్చి చంపారు. ఇక గ్రామంలో కమ్యూనిస్టు పార్టీని నిర్మూలించామని భూస్వామ్య పాలక వర్గం, పోలీసువారు భావించారు. సరిగ్గా ఈ సమయంలోనే ఇంటర్మీడియట్ పూర్తి చేసి విద్యార్థి నాయకుడిగా ఉన్న చించినాడ గ్రామస్తుడు రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్.ఎస్) ఈ పరిణామాలకు రగిలిపోయి గ్రామంలో ఎర్రజెండా రెపరెపలాడాలని, ప్రజల కష్టాలు తీరాలని కంకణం కట్టుకున్నారు. ఆయనకు కేతా సూర్యారావు తదితరులు తోడయ్యారు. చిదిమేసినా...పార్టీని తిరిగి అంకురింపచేశారు.

స్థానిక పోరాటాలతో పార్టీ నిర్మాణం

పాలక వర్గ హింసతో ప్రజలు భయభ్రాంతులై కమ్యూనిస్టు పార్టీ వైపు పోరని, అక్కడితో ఆగిపోతారని భావించారు. కాని రెట్టించిన ఉత్సాహంతో యువత పార్టీ వైపు వచ్చారు. ఆనాడు గ్రామంలో కూలి రేట్లు బాగా తక్కువగా ఉండేవి. పనిలేని రోజుల్లో ప్రజలు పస్తులుండేవారు. ఆకలి తీర్చుకోవడానికి తాటిపండ్లు కాల్చుకు తినేవారు. ఈ విధంగా సంవత్సరంలో 3 మాసాలు (ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు) పేదలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని కమ్యూనిస్టు పార్టీ గ్రహించి కలక్టరేట్‌కు ఆకలి యాత్రలు నిర్వహించి ప్రభుత్వం బియ్యం పంపిణీ చేసేలా చర్యలు చేపట్టింది. పార్టీనే స్వయంగా భూస్వామ్య, ధనిక రైతుల నుండి ప్రొక్యూర్‌మెంట్ రేటుకు సంవత్సరానికి 1000 బస్తాల ధాన్యం కొనుగోలు చేసి మిల్లు ఆడించి...బయట మార్కెట్‌లో కిలో రూ.8 అమ్ముతుంటే రూ.1.15 పైసలకే అమ్మి పేదల ఆకలి తీర్చింది. కష్టజీవులను ఏకం చేసి పోరాడి కూలీ రేట్ల పెంపుదల సాధించింది. భూస్వాములు కక్షగట్టి చించినాడ గ్రామంలో కూలీలను పిలవకుండా బయట గ్రామంలో కూలీలను తెచ్చి పని చేయిస్తుంటే ప్రతిఘటించింది. ప్రభుత్వంపై పోరాడి లక్షల రూపాయల గ్రాంట్లు తెచ్చి ఆనాడే పనికి ఆహార పథకం సాధించింది. దీనితో పార్టీ పట్ల పేద, మధ్య తరగతి ప్రజల్లో ఎనలేని విశ్వాసం ఏర్పడింది. ఈ అంశాలన్నిటితో భూస్వామ్య వర్గాలు కమ్యూనిస్టు పార్టీపై కక్ష పెంచుకున్నాయి. నాటి కాంగ్రెస్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి పరకాల శేషావతారం సహకారంతో పార్టీపై నిర్బంధం ప్రయోగించారు.

త్యాగాలు లేనిదే కమ్యూనిస్టు ఉద్యమం లేదు

కమ్యూనిస్టు పార్టీని దెబ్బ కొట్టాలంటే పేదల్లో చీలిక ద్వారానే సాధ్యమౌతుందని గ్రహించిన భూస్వామ్య వర్గాలు ఎస్.సి, బి.సి పేటల లోని కొంతమందిని లంక భూములు ఇప్పిస్తామని, పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఇతర ప్రలోభాలు పెట్టి కొద్దిమందిని చీల్చారు. 1977–80 సంవత్సరాలలో భూస్వామ్య శక్తులు వెనకుండి ఉసిగొల్పి దాడులు చేయించి ఆరుగురు సిపిఎం కార్యకర్తలను (యాండ్ర సత్యనారాయణ, వీరవల్లి నారాయణ, పంతగాని సూరన్న–చించినాడ, అనిశెట్టి కాళిదాసు, గుబ్బల సాంబమూర్తి–కాజ, గుబ్బల రామలింగయ్య–కలగంపూడి) హత్య చేయించారు. ఈ సమయంలో జరిగిన దాడిలో కేతా సూర్యారావు చేయి ముక్కలు ముక్కలుగా విరిగిపోయింది. అనేక మంది కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. పురుషులకు ధీటుగా వీరవనితలు పోరాటంలో పాల్గొని శత్రువుని వణికించారు. ఈ కాలంలోనే ఆర్.ఎస్, కేతా సూర్యారావు మరో 40 మంది ఏళ్ళ తరబడి జైలు జీవితం, అజ్ఞాతవాసం గడిపారు. 150 మంది కేసులు మోపబడి కోర్టులు చుట్టూ తిరిగారు. ఈ సమయంలో నాయకులు, ముఖ్య కార్యకర్తలు తిండికి, నిద్రకు, కుటుంబాలకు దూరమయ్యారు. శారీరక హింసలే కాక, మానసిక వేదనకు గురయ్యారు. అయినప్పటికీ ముందుకే కదిలారు. ఎన్నో త్యాగాల ఫలితంగానే గ్రామంలో పార్టీ బలోపేతం అయింది.

కమ్యూనిస్టులకు అధికారమిస్తే ఏం సాధిస్తారో చూపించిన గ్రామం

చించినాడ గ్రామ పంచాయతీ 1933–53 వరకు పెత్తందార్ల పాలనలో ఉంది. 1953లో కమ్యూనిస్టు పార్టీ నాయకుడు ఆర్.ఎస్ ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. నాటి నుండి 2021 వరకు 68 సంవత్సరాల పాటు రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా అవిచ్ఛిన్నంగా సిపిఎం జెండా ఎగిరింది. 62 సంవత్సరాల పాటు (1957 నుండి 2019 వరకు) వ్యవసాయ పరపతి సంఘం సొసైటీని నడిపింది. ఫీల్డ్ లేబర్ సొసైటీ ఏర్పాటు చేసి 60 ఎకరాలను పంచి 270 మంది పేదలకు పట్టాలు ఇప్పించింది. కో ఆపరేటివ్ సొసైటీ రూ.50 వేలతో ఏర్పాటు చేసి రూ.5 కోట్ల టర్నోవర్‌కి పెంచింది. గ్రామంలోని పంచాయతీ, ప్రభుత్వ స్థలాలలో వెయ్యి కొబ్బరి చెట్లు పెంచి లక్షల రూపాయలు పంచాయతీకి ఆదాయం వచ్చే చర్యలు చేపట్టింది. ప్రతి పేటలో స్కూలు, కమ్యూనిటీ హాలు, సి.సి రోడ్లు, మంచినీరు అందించింది. గ్రంథాలయాన్ని నిర్మించింది. పాలక పార్టీలు సహకరించకపోయినా ఉన్న వనరులతోనే గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేసింది.



చించినాడ అమరవీరుల
75 ఏళ్ల సంస్మరణ కార్యక్రమం సందర్భంగా

నేడు మరింత కృషి అవసరం

ప్రజలు ఐక్యంగా వుంటే తమ దోపిడీ పాలన సాగదనుకున్న పాలకవర్గాలు మతం, ప్రాంతం, కులం, భాష, లింగ పరంగా విభజించే ప్రయత్నాలే సాగిస్తున్నాయి. పాలక పార్టీలు అనేకం పుట్టుకొచ్చి శ్రామిక వర్గాన్నే మరింత చీల్చేస్తున్నాయి. అనేక భ్రమలు కలిగించి తమతోనే ఉండే విధంగా విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. భూస్వామ్య, ధనిక శక్తులు పార్టీల పరంగా చీలిపోయినా వర్గ సమస్యలపుడు వారంతా సులభంగా ఒక్కటైపోతున్నారు. కాని శ్రామిక వర్గం కుల, రాజకీయ వైరుధ్యాలతో చీలిపోయేలా చేస్తున్నారు. శ్రామిక వర్గాన్ని కూడగట్టడం సంక్లిష్టంగా మారిన నేటి పరిస్థితుల్లో మరింత నైపుణ్యంతో నూతన పద్ధతులలో పని చేయాలి. ప్రజలకు మరింత చేరువ అవ్వడం ద్వారానే తిరిగి చెదిరిపోయిన శ్రేణులను రాబట్టుకోగల్గుతాం. ఉద్యమాన్ని పున:నిర్మించి ముందుకు తీసుకుపోవడమే అమరవీరులకు మనం అర్పించే ఘన నివాళి.

(వ్యాసకర్త సిపిఎం పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి)

కవిత్వం

నేల దిగులుగా కూర్చుంది..!

ఆ చీకటి ఆకాశంలో మెరుపులు
నీటి చుక్క కోసం ఎదురు చూపులు
సప్త సముద్రాలు మోస్తున్నను
వర్షపు చుక్క కోసం నింగి వైపే చూపులు..

సముద్రంలో అలజడి స్తబ్దతగా ఉంది
మండే సూర్యుడు మేఘం చాటుకు పోయే
దప్పిక కొన్న నేల దిగులుగా కూర్చుంది
ఎండిన పొరల్లో జ్ఞాపకాలు తలుచుకుంటూ..

ఒరిగిన చెట్టు నింగిని చూడదు
చల్లని కబుర్లు మొయ్యడం లేదు
విషం తింటున్న ప్రకృతికి రోగం పుట్టి
పంచభూతాలు ఆకృతి కోల్పోయాయి..

చుట్టములా పలకరించే వర్షం
ఒక్క పూట కూడా తిష్ట వెయ్యదు
హడావిడిగా వచ్చి ఆశలు ఎన్నో కల్పించి
వలస జీవి చిరునామా మారిపోయి..

నేలలో గింజ ఊపిరాడక నిలుచుంది
కాసింత నీళ్ల కోసం తపస్సు చేస్తూ
పిడికెడు మట్టిలో ప్రాణాన్ని బిగబట్టి
రెండు చేతులతో నింగిని నమస్కరించాలని..

సమస్త ప్రాణులకు అక్షయపాత్ర ఈ నేల
ఆదిత్యుడి అనుగ్రహం కోసం ఎదురుచూస్తూ
సకాలంలో వరుణుడు కాస్త కనికరిస్తే
మట్టి పుత్రుడు ధాన్యపు సిరులు పండిస్తాడు.

- కొప్పుల ప్రసాద్,
సెల్ : 9885066235

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

బ్లాక్ బాక్స్ డీకోడింగ్ ఇక్కడే

- అహ్మదాబాద్ విమాన ప్రమాదాన్ని దర్యాప్తు చేస్తున్న ఎఎఐబి

న్యూఢిల్లీ : గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాద ఘటన యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. అయితే, ఈ ప్రమాదానికి సంబంధించిన దర్యాప్తుపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. ఇప్పటి వరకు బ్లాక్ బాక్స్‌ల డీకోడింగ్‌పై విదేశాలపై ఆధారపడే భారత్.. ఇప్పుడు అవుట్‌సోర్సింగ్(విదేశాలు)తో సంబంధం లేకుండా పూర్తిగా దేశీయంగానే దర్యాప్తును జరుపుతున్నది. ఏఐ-171 విమాన ప్రమాద ఘటనపై పూర్తి దేశీయ సామర్థ్యంతోనే దర్యాప్తు సాగించనున్నది. ఇందులో భాగంగా ది ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) ఎయిరిండియా ఫ్లైట్ ఏఐ-171కు చెందిన బ్లాక్ బాక్స్‌ను తొలిసారి పూర్తిగా దేశంలో డీకోడ్ చేస్తున్నది. న్యూఢిల్లీలోని ఎఎఐబి ల్యాబ్‌లో దీని దర్యాప్తు సాగుతున్నది. విమానం క్రాష్ ప్రొటెక్షన్ మాడ్యుల్ (సిపిఎం) నుంచి మెమోరీ మాడ్యుల్‌ను విజయవంతంగా యాక్సెస్ చేసి, ఈనెల 25న ఎఎఐబి ల్యాబ్‌లో డేటాను డౌన్‌లోడ్ చేసినట్టు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తెలిపింది.

కేరళ అభివృద్ధికి అందరి సహకారం అవసరం

'లులు' ఐటి ట్విన్ టవర్స్ ప్రారంభోత్సవంలో పినరయి విజయన్


లులు ఐటి ట్విన్ టవర్ల ప్రారంభోత్సవంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తదితరులు

కొచ్చి : కేరళ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. కాకనాడ్‌లోని స్మార్ట్‌సిటీలో లులు గ్రూప్ అభివృద్ధి చేసిన లులు ఐటి ట్విన్ టవర్స్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. రూ.1,500 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేసిన ఈ ఐటి కాంప్లెక్స్‌లో ఒక్కొక్కటి 30 అంతస్తులతో రెండు ఒకేలాంటి టవర్లు ఉన్నాయి. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ ఇన్ఫోపార్క్ ఫేజ్-2 విస్తరణలో ఐటి టవర్‌ను ఏర్పాటు చేయడానికి లులు గ్రూప్ రూ.500 కోట్లు పెట్టుబడి పెడుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా 7,500 మందికిపైగా నిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు విడి సతీశన్ మాట్లాడుతూ, ఈ జంట టవర్ల ప్రాజెక్ట్ ప్రపంచ ఐటి రంగంలో కేరళ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. లులు గ్రూప్ చైర్మన్ యూసుఫ్ అలీ ఎం.ఎ. మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ కేరళలోని యువతకు ప్రొఫెషనల్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు. మూడున్నర ఎకరాల్లో తొమ్మిదిన్నర లక్షల చదరపు అడుగులతో ఐటి టవర్ తరహాలో నిర్మిస్తామని తెలిపారు.

ఈ భూమిలో సాగు చేయొద్దు

- దళిత కుటుంబంపై కర్రలతో దాడి
- మధ్యప్రదేశ్‌లో కొందరు దుండగుల దుశ్చర్య

భోపాల్ : దేశంలో కులవివక్ష, భూమి హక్కులపై కలతపెట్టే మరో ఘటన మధ్యప్రదేశ్‌లో చోటు చేసుకున్నది. తమ భూమిని సాగు చేసుకుంటున్న ఓ అమాయకపు దళిత కుటుంబంపై కొందరు దుండగులు రెచ్చిపోయారు. బాధితులపై కర్రలతో దాడికి దిగారు. మహిళలని కూడా చూడకుండా కొట్టారు. అంతటితో ఆగకుండా ఆ కుటుంబం తీసుకొచ్చిన విత్తనాలను కూడా నిందితులు బలవంతంగా లాక్కెళ్లారు. ఈ ఘటనలో గాయపడిన ఇద్దరు మహిళలతో పాటు మొత్తం నలుగురు ఆస్పత్రి పాలయ్యారు. బాధితుల కథనం ప్రకారం.. విదిశలోని నారాయణపుర గ్రామంలో ఒక దళిత కుటుంబం తమ వ్యవసాయ భూమిలో విత్తనాలను విత్తుతున్నది. ఇది గమనించిన కొందరు దుండగులు దళిత కుటుంబసభ్యులపై దాడికి దిగారు. ఈ దాడిలో ఇద్దరు మహిళలు కూడా గాయపడ్డారు. అంతటితో ఆగకుండా ఆ కుటుంబం తెచ్చుకున్న సోయాబీన్ విత్తనాలనూ నిందితులు లాక్కెళ్లారు. వాటిని తమ వ్యవసాయ భూమిలో విత్తారు. ఈ దాడి ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరు మహిళలూ ఉన్నారు. చికిత్స కోసం వీరిని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. దళిత కుటుంబంపై దాడికి సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

'ఉపాధి'లో చేతివాటం..!

- పైసలు ఇచ్చుకో..మస్టర్ పెట్టుకో..
- ఆత్మకూరు మండలంలో పెచ్చుమీరిన అవినీతి

ప్రజాశక్తి-ఆత్మకూరు

కేంద్ర ప్రభుత్వం వలసల నివారణకు ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అవినీతి మయం అయ్యిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆత్మకూరు మండల కేంద్రంలో ఉపాధి హామీ సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శిస్తూ రూ.లక్షలు దండుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని వేపచెర్ల, బి.యాలేరు, నసన, సంబంధిత గ్రామాల్లో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి, సంబంధిత గ్రామస్థాయి ఫీల్డ్ అసిస్టెంట్లు సహకారంతో పాత పనులకు కొత్త బిల్లులు పెడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల అధికార పార్టీ నాయకుల పెత్తనంతో యంత్రాలతో పనులు చేయిస్తూ నిధులు కాజేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని గ్రామాల్లో కూలీలకు పనులు చూపాలంటే రూ.200, జాబ్ కార్డులో పేరు రావాలంటే రూ.300 నుంచి రూ.500 వరకు క్షేత్రస్థాయి సిబ్బంది వసూలు చేస్తున్నట్లు సమాచారం.

టిటిడిలో భారీగా ఉద్యోగ విరమణలు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానంలో రోజురోజుకూ శాశ్వత ఉద్యోగులు గణనీయంగా తగ్గిపోతున్నారు. జూన్ 30న దాదాపు 140 మంది శాశ్వత ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇందులో ప్రధానమైనటువంటి కీలక విభాగాల్లో ఉన్న డిప్యూటీ ఈవోలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారులు నుండి దిగువ శ్రేణి శాశ్వత ఉద్యోగులు భారీగానే ఉద్యోగ విరమణ చేయనున్నట్టు టిటిడి అధికారులు వెల్లడించారు. ఇంత పెద్ద ఎత్తున ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీలు కూడా భర్తీ చేయాలని టిటిడి ఉద్యోగులు కోరుతున్నారు.

2న వంశధార నీరు విడుదల



నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

- శివారు భూములకూ నీరందించాలి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా)

వంశధార కుడి, ఎడమ కాలువ ఆయకట్టు నుంచి సాగునీటిని జూలై రెండో తేదీన విడుదల చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముందుగా రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వలు పెంచి శివారు ప్రాంతాలకు సైతం నీరందించాలని ఆదేశించారు. మండలంలోని నిమ్మాడలో క్యాంపు కార్యాలయంలో శనివారం నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతాంగానికి పూర్తిస్థాయిలో సాగునీరందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలువల ద్వారా నీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే, తక్షణమే తొలగించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు పర్యటించి రైతులకు అవసరైన సూచనలు, సలహాలు అందించాలని సూచించారు. గొట్టాబ్యారేజీలో ఇప్పటివరకు 1400 క్యూసెక్కుల నీటిని నిల్వ చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు మంత్రికి వివరించారు. అవసరమున్న ప్రాంతాల్లో తాత్కాలిక సిబ్బందిని నియమించుకుని కాలువల్లో ప్రవహిస్తున్న నీరు వృథా కాకుండా పర్యవేక్షణ చేసేందుకు అవకాశం ఉంటుందని మంత్రి సూచించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు స్వర్ణకుమార్, శేఖర్‌రావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కీర్తి చక్ర పురస్కార అవార్డు గ్రహీతకు అభినందనలు

విధి నిర్వహణలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన నగిరిపెంటకు చెందిన ఆర్మీ మేజర్ మల్ల రామ్‌గోపాల్ నాయుడును మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. కీర్తి చక్ర పురస్కారం తీసుకోవడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఇటీవల ఐపిఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి చక్కటి ప్రతిభ కనబరిచిన వర్ధమాన ఆటగాడు త్రిపురాన విజయ్‌ను మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. ప్రభుత్వం తరుపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మంత్రిని కలిసిన వారిలో విజయ్ తల్లిదండ్రులు కృష్ణంరాజు, లావణ్య, వినయ్ తదితరులున్నారు.

సెర్బియాలో కదంతొక్కిన విద్యార్థులు



బెల్గ్రేడ్ : విద్యార్థుల నేతృత్వంలో సెర్బియా రాజధాని బెల్గ్రేడ్‌లో శనివారం లక్షలాది మంది నిరసనకారులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ అవినీతిపై గత నవంబర్ నుండి విద్యార్థి లోకం పోరాడుతోంది. ముందస్తు పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. రాజధానిలోని ప్రధాన స్క్వేర్‌లో జాతీయ జెండాలు, బ్యానర్లతో "మేము సమస్య కాదు, మేము ఫలితం" అని నినదించారు.

ఎందుకీ నిరసనలు?

గత నవంబర్‌లో నోవి సాడ్‌లో రైల్వేస్టేషన్ పైకప్పు కూలిపోయి 16 మంది మరణించిన ఘటన తర్వాత నిరసనలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ అవినీతి, నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందంటూ విశ్వవిద్యాలయాల విద్యార్థులు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. ఈ మరణాలపై పారదర్శక విచారణ జరపాలని, ముందస్తు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

అధ్యక్షుడికి అల్టిమేటం

విద్యార్థులు శనివారం రాత్రి 9 గంటలలోపు ఎన్నికలు ప్రకటించాలని అధ్యక్షుడు అలెక్సాండర్ పుసిక్‌కు గడువు విధించారు. పుసిక్ శుక్రవారమే ఈ డిమాండ్‌ను తిరస్కరించారు. 2026 చివరి వరకు ఎన్నికలు ఉండవని చెప్పారు.

మున్సిపల్ కమిషనర్‌పై పరువు నష్టం నోటీసు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి అనర్హత వివాదం రగులుతూనే ఉంది. అనర్హత అంశంపై ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మిపై స్వర్ణమణి పరువు నష్టం దావా వేయగా, తాజాగా మున్సిపల్ కమిషనర్ రమేష్‌కు లీగల్ నోటీసులను పంపించారు. అనర్హత అంశంలో అసత్యపు వార్త మీడియాకు విడుదల చేసి తన పరువు ప్రతిష్టకు భంగం కలిగించారని పేర్కొంటూ రూ.12 లక్షల పరువు నష్టం లీగల్ నోటీసును న్యాయవాది ద్వారా పంపించారు. అనర్హత విషయమై జిల్లా జడ్జికి సెక్షన్ 17(3) ప్రకారం దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్నా మున్సిపల్ కమిషనర్ ఆవిధంగా చేయలేదని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం అజెండాను తనకు పంపించలేదని చెప్పారు. అజెండా సర్వీస్ రిజిస్టరులో తన పేరు ఉండాల్సిన చోట ఖాళీగా ఉంచినట్లు తెలిపారు. సెక్షన్ 17(3) ప్రకారం జిల్లా జడ్జి తీర్పునిచ్చే వరకు తనకు అనర్హత వర్తించదని, తనకు అజెండా ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌ను రాతపూర్వకంగా కోరానన్నారు. జిల్లా జడ్జి తీర్పు వెలువడే వరకు తనకు అనర్హత వర్తించదని హైకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. కౌన్సిల్ ఆమోదం పొందినందున జిల్లా జడ్జికి దరఖాస్తు చెయ్యనవసరం లేదని, తాను అనర్హత పొందినట్లు తప్పుడు వార్తను ప్రచారం చేసి, తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించారని చెప్పారు.

సహకార సంఘాలపై నిర్లక్ష్యం

- వైసిపి బాటలోనే టిడిపి కూటమి సర్కారు
- ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన
- మళ్లీ త్రీమెన్ కమిటీలపై కసరత్తు



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సహకార సంఘాల ఎన్నికల కోసం రైతులు ఎదురు చూపులు చూస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి సర్కారు సైతం ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తోంది. మరోసారి త్రిసభ్య కమిటీలను నియమించేందుకు కసరత్తులు ప్రారంభించింది. దాదాపు పదేళ్ల నుంచి ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా పరిస్థితుల్లో పెద్దగా మార్పులు కనిపించకపోవడంతో కూటమి పాలకులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో 299 ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. 2013 ఎన్నికల నాటికి దాదాపు 4 లక్షల మంది సభ్యులు, సుమారు 2.5 లక్షల మంది ఓటర్లున్నారు. జిల్లాలోని సహకార సంఘాలకు పదేళ్ల క్రితం ఎన్నికలు జరిగాయి. గత ఎన్నికలు 2013 డిసెంబరులో కొన్ని, 2014, జనవరి, ఫిబ్రవరిలో మరికొన్ని సంఘాలకు జరిగాయి. అయిదేళ్లకొకసారి జరగాల్సిన ఎన్నికలను అప్పటి, ప్రస్తుత ప్రభుత్వాలు పాలకవర్గం గడువు పెంచుకుంటూ వచ్చాయి.

మళ్లీ త్రిసభ్య కమిటీలే

2014 నుంచి 2019 వరకూ పాలించిన టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా త్రీమెన్ కమిటీలతోనే సరిపెట్టింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి సైతం అదే బాటలో నడిచింది. త్రిసభ్య కమిటీ పేరిట పాలకవర్గాలు నియమించి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పార్టీ కార్యకర్తలను నియమించడంతో సహకార సంఘాలు పూర్తి నిర్లక్ష్యానికి గురయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమాలకు అడ్డాగా తయారయ్యాయని విమర్శలు సైతం ప్రతిపక్షాల నుంచి వినిపించాయి. దీంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రూ.300 కోట్లకు పైనే నష్టాలకు గురయిందని అధికారులు చెబుతున్నారు. ఏడాది క్రితం కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత త్రీమెన్ కమిటీలను రద్దు చేసి అధికారులను పర్సన్ ఇన్‌ఛార్జులుగా నియమించింది. వీరి గడువు ఈ నెల 28తో ముగుస్తుంది. మరో ఆరు నెలల పాటు గడువు పెంచాల్సి ఉంది. కానీ సరిపడా అధికారులు లేకపోవడంతో కేవలం నెల రోజులు మాత్రమే పొడిగించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే మరోసారి కూటమి నాయకులతో త్రిసభ్య కమిటీని నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. దీంతో ఆశావహులంతా పోటీ పడుతున్నారు. టిడిపి, జనసేన నాయకులు ఈ పదవుల కోసం పోటీ పడుతున్నారు.

ఎన్నికల కోసం ఎదురుచూపులు

ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికల కోసం గత కొన్నేళ్లుగా రైతులు ఎదురు చూస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం పూర్తి స్థాయి పాలక వర్గాలు లేకుండానే నెట్టుకొచ్చింది. 2018లో టిడిపి ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా అప్పట్లో సొసైటీలకు పర్సన్ ఇన్‌ఛార్జిలను నియమించింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా త్రీమెన్ కమిటీలతోనే సరిపెట్టింది. ఎన్నికలు నిర్వహించాలని సహకార సంఘాల ప్రతినిధులు కొంతకాలంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా కూటమి ప్రభుత్వం కూడా త్రీమెన్ కమిటీలనే నియమిస్తామని చెబుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నూతన జాతీయ విద్యా విధానానికి

ప్రత్యామ్నాయంగా ప్రజానుకూల విధానం

- ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభ డిమాండ్

పాలస్తీనా సాలిడారిటీ నగర్ (కోజికోడ్) : నూతన జాతీయ విద్యా విధానం (2020)కు ప్రత్యామ్నాయంగా దేశంలో ప్రజానుకూల విధానం ఉద్భవించాలని ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభ తీర్మానం ద్వారా డిమాండ్ చేసింది. సమానత్వం, సామాజిక న్యాయం, శాస్త్రీయ అవగాహనతో కూడిన ప్రత్యామ్నాయ విద్యా విధానం దేశంలో అమలులో ఉండాలని స్పష్టం చేసింది. కేరళలోని కోజికోడ్‌లో (పాలస్తీనా సాలిడారిటీ నగర్) నాలుగు రోజులపాటు జరిగే ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభ రెండో రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా వివిధ తీర్మానాలను మహాసభ ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వం లోపభూయిష్టమైన, ప్రజా వ్యతిరేక విధానాన్ని విధిస్తోందని విమర్శించింది. మతతత్వం, వాణిజ్యకరణ, కేంద్రీకరణపై దృష్టి సారించడం ద్వారా విద్యను నాశనం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని పేర్కొంది. ప్రైవేటీకరణను ప్రోత్సహించడంతో విద్యను పూర్తిగా వాణిజ్యకరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, విద్యా రంగంలో రాష్ట్రాల హక్కులను రాజ్యాంగ విరుద్ధంగా లాక్కొంటున్నారని విమర్శించింది. వెనుకబడిన మైనారిటీ వర్గాల విద్యార్థులను వారి చదువుల నుండి తొలగిస్తున్నారని, దేశంలోని ప్రభుత్వ విద్యా రంగంలో అవినీతిని వ్యాప్తి చేయడంతో విద్యా విధానాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మహాసభ పేర్కొంది. విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించే, అణగారిన వర్గాలను విముక్తి చేసే కొత్త విధానం తీసుకురావాలని డిమాండ్ చేసింది. కార్పొరేట్ దురాశకు, నిరంకుశ భావజాలానికి లొంగకుండా, విద్యార్థులు అన్యాయాన్ని ప్రతిఘటించేలా శక్తిమంతం చేసే ప్రజానుకూల విధానాన్ని రూపొందించాలని మహాసభ పిలుపునిచ్చింది. మహాసభలో ఆంధ్రప్రదేశ్ నుంచి పల్లవి, జహీదా, సాయి ఉదయ్ మాట్లాడారు.



ఎస్ఎఫ్ఐ మహాసభకు హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు

పోరాట మార్గంలో నడిపించింది ఎస్ఎఫ్ఐ : అఖిల భారత మాజీ నేతలు

మనందరినీ పోరాట మార్గంలో నడిపించింది ఎస్ఎఫ్ఐ అని సంఘం అఖిల భారత మాజీ నేతలు పేర్కొన్నారు. పిడికిలి బిగించి మహాసభ వేదిక వద్దకు చేరుకున్న వారిని రెడ్ సెల్యూట్ చెబుతూ వేలాదిమంది ప్రతినిధులు స్వాగతించారు. అత్యవసర పరిస్థితితో సహా చీకటి కాలంలో హింస, అణచివేత నుండి బయటపడిన అనుభవాలతో కూడిన వారి పోరాటాలను కొత్త తరంతో పంచుకున్నప్పుడు ఉత్సాహం ఆకాశాన్ని తాకింది. ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభతో కలిసి నిర్వహించిన మాజీ నాయకుల సమావేశం ఉల్లాసమైన, ఆలోచనపరమైన చర్చకు వేదికైంది.

ఎస్ఎఫ్ఐ మొదటి ప్రధాన కార్యదర్శి బిమన్ బసు నుంచి గత మహాసభ వరకు ఉన్న అఖిల భారత మాజీ నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. మాజీ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, కేంద్ర కమిటీ సభ్యులు కూడా హాజరయ్యారు. హక్కుల కోసం పోరాటంలో అమరులైన వారి కుటుంబ సభ్యులు కూడా వచ్చారు. వేదికపై ప్రతి నాయకుడి మాటల్లో ప్రతినిధులు ఉద్యమ చరిత్రను విన్నారు. అత్యవసర పరిస్థితిలో ఎస్ఎఫ్ఐ చేసిన పోరాటాలు, అన్యాయాలపై ఉద్యమించిన తీరు సభికుల్లో ఉత్తేజాన్ని నింపింది. ప్రతినిధులు నినాదాలతో నాటి అనుభవాలను స్వాగతించారు.

ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు విపి సాను ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. అఖిల భారత మాజీ నాయకులు ప్రకాశ్ కరత్, ఎంఎ బేబీ, ఎ విజయరాఘవన్, నీలోత్పల్ బసు, వై వెంకటేశ్వరరావు, కెఎన్ బాలగోపాల్, పి కృష్ణ ప్రసాద్, ఆర్ అరుణ్ కుమార్, కెకె రాకేష్, పికె బిజు, వి శివదాసన్, విక్రమ్ సింగ్‌తో పాటు ఇతరులు తమ అనుభవాలను పంచుకున్నారు. అఖిల భారత ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిశ్వాస్ సభకు స్వాగతం పలికారు.

గుజరాత్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ నేత ఘనవిజయం

- గ్రామ అభివృద్ధే లక్ష్యమన్న వద్‌వాసా సర్పంచ్ సత్యేషా



సూరత్ : గుజరాత్‌లోని సబరకాంత జిల్లాలోని ప్రాంటిజ్ తాలుకాలో వద్‌వాసా గ్రామ సర్పంచ్‌గా 25 ఏళ్ల ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది సత్యేషా లెవా గెలుపొందారు. పార్టీ చిహ్నాలపై గ్రామ పంచాయితీ ఎన్నికలు జరగనప్పటికీ తాను కమ్యూనిస్టు సిద్ధాంత భావజాలాన్ని అనుసరిస్తానని సత్యేషా చెప్పారు. గుజరాత్‌లో సిపిఎం ఆఫీసు బేరర్‌గా కూడా వున్నారు. గుజరాత్‌లోని దాదాపు 3,894 గ్రామ పంచాయితీలకు జరిగిన ఎన్నికల్లో ఈ నెల 26న ఓట్ల లెక్కింపు జరిగింది. ఎస్‌సి మహిళకు రిజర్వ్ చేసిన ఈ సీటు నుంచి పోటీ చేసిన సత్యేషాకు మొత్తంగా 596 ఓట్లు లభించాయి. ఆమె ప్రత్యర్థులు సవిత, పుష్పలకు వరుసగా 492, 236ఓట్లు లభించాయి. సైన్స్ గ్రాడ్యుయేట్ అయిన సత్యేషా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి. వృత్తిరీత్యా న్యాయవాది. అహ్మదాబాద్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. అనేక ప్రజా సమస్యల పరిష్కారాలపై ఆమె దీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. సిపిఎం సబరకాంత జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలైన ఆమె పార్టీ రాష్ట్ర కమిటీకి శాశ్వత ఆహ్వానితురాలు. వద్‌వాసా గ్రామ సర్పంచ్ ఎన్నిక 2020 నుండి జరగలేదు. స్థానిక సంస్థలకు ఒబిసి రిజర్వేషన్ నిర్ధారించే విషయం పెండింగ్‌లో వుండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దాంతో 2020 నుండి గ్రామ వ్యవహారాలను అడ్మినిస్ట్రేటర్ చూస్తున్నారు.

గ్రామ అభివృద్ధే లక్ష్యం : సత్యేషా

ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌తో సత్యేషా మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే లక్ష్యమని చెప్పారు. గ్రామంలో రోడ్లు వేయడం, వీధి దీపాలు ఏర్పాటు చేయడం చాలాకాలం నుండి జరగలేదని, అది వెంటనే చేపట్టడమే తన తక్షణ ప్రాధాన్యత అని తెలిపారు. గ్రామంలో చెత్తను నిర్మూలించడం కూడా ముఖ్యమైన పనేనని చెప్పారు. గ్రామంలో ఇళ్లు మంజూరైనా ఇంతవరకు వాటిని ప్రజలకు అప్పగించలేదన్నారు. గ్రామంలో ఆరోగ్య కేంద్రాన్ని, లైబ్రరీని, జిమ్నాజియంను ఏర్పాటు చేయడం తన లక్ష్యమన్నారు. జాతీయ రహదారికి దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో తమ గ్రామం వుంటుందని, అక్కడకు బస్సులు చాలా తక్కువగా వున్నాయని తెలిపారు. అందువల్ల మూడు నాలుగు ఎలక్ట్రిక్ రిక్షాలు పెట్టాలనుకుంటున్నట్లు చెప్పారు.

సత్యేషా విజయవంతమవుతారు : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి హిమంత్ భట్

సత్యేషా విజయంపై గుజరాత్ రాష్ట్ర కార్యదర్శి హితేంద్ర భట్ స్పందిస్తూ ప్రజల కోసం పనిచేసే పార్టీ తమదని అన్నారు. సత్యేషా విజయం పట్ల సంతోషంగా వున్నామని చెప్పారు. ఆమె విజయవంతమైన సర్పంచ్ అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

'మేం స్నేహితులమే.. మీరూ తమిళం నేర్చుకోండి'

- కనిమొళి

చెన్నై, ముంబై : హిందీ భాష ఎవరికీ శత్రువు కాదని, ఆ భాషను స్నేహపూర్వకంగా దక్షిణాది రాష్ట్రాలు చూడాలన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై పలువురు ప్రముఖులు స్పందించారు. డిఎంకె ఎంపి కనిమొళి మాట్లాడుతూ తాము హిందీ నేర్చుకోవడం సంగతిని కాసేపు పక్కన పెట్టి, ఉత్తరాది వారు తమిళం నేర్చుకుంటే బాగుంటుందని అన్నారు. అలాగైనా తమిళ భాషకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఇచ్చినట్లు అవుతుందని ఆమె పేర్కొన్నారు. 'మేం(తమిళులం) కూడా ఎవరికీ శత్రువులం కాదు.. మేం కూడా స్నేహితులమే. మా భాష కూడా అంతా నేర్చుకోవచ్చు. ప్రత్యేకంగా నార్త్ ఇండియన్స్ తమిళం నేర్చుకంటే బాగుంటుంది' అని అమిత్ షా పేరును ప్రస్తావించకుండానే తనదైన శైలిలో కనిమొళి చురకలంటించారు.

ప్రైమరీ స్కూల్ స్థాయిలో వద్దు : శరద్‌పవార్

'మహారాష్ట్ర ప్రజలు హిందీ భాషకు వ్యతిరేకం కాదు. 1 నుంచి 4 తరగతుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తప్పనిసరిగా హిందీ నేర్చుకోవాలని నిబంధన విధించడం మాత్రం తగదని' ఎన్‌సిపి అధ్యక్షుడు శరద్ పవార్ అన్నారు. భాషా వివాదాలపై పవార్ స్పందిస్తూ.. మరాఠా, ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో 1 నుంచి 5వ తరగతి వరకు హిందీని మూడోభాషగా బోధించాలని గత వారం మహారాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులతో వివాదం మొదలైందని అన్నారు. మహారాష్ట్ర విద్యార్థులపై హిందీని రుద్దే ప్రయత్నాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తామని, జూలై 5, 7 తేదీల్లో విడివిడిగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని శివసేన (ఉద్ధవ్), మహారాష్ట్ర నవ నిర్మాణసేన పార్టీలు ఇప్పటికే ప్రకటించాయి. మరాఠీ మూలాలు రూపుమాపడానికి రాష్ట్ర ప్రభుత్వం భాషాపరమైన ఎమర్జెన్సీని విధిస్తోందని విమర్శించాయి.

మహారాష్ట్రలో 5న ప్రతిపక్షాల ర్యాలీ

త్రిభాషా విధానంలో భాగంగా మహారాష్ట్ర ప్రభుత్వం హిందీని రుద్దేందుకు ప్రయత్నించడాన్ని నిరసిస్తూ జూలై 5న నిరసనలకు ప్రతిపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ నిరసనల్లో ఎన్‌సిపి (ఎస్‌సిపి), మహారాష్ట్ర నవ నిర్మాణ సేన (ఎంఎన్ఎస్), శివసేన (యుబిటి) నేతలు పాల్గొనున్నట్లు ఎన్‌సిపి (ఎస్‌సిపి) పార్టీ నేత సుప్రియా సూలే శనివారం మీడియాకు వెల్లడించారు. జులై 5న అన్ని పార్టీలతో కలిసి, 6, 7 తేదీల్లో తమ పార్టీ ఆధ్వర్యాన హిందీ భాషకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టనున్నట్లు శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్ తెలిపారు.

కోల్‌కతా లా విద్యార్థినికి న్యాయం చేయాల్సిందే

- గ్యాంప్ రేప్‌పై భారీ నిరసనలు
- ప్రజాసంఘాలపై లాఠీఛార్జి

కోల్‌కతా : దక్షిణ కలకత్తా లా కాలేజీ విద్యార్థినిపై ఈ నెల 25న సామూహిక అత్యాచారం ఘటనను నిరసిస్తూ కోల్‌కతాలో పలుచోట్ల నిరసనలు వెల్లువెత్తాయి. బాధిత విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా కార్యకర్తలు ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. లా కాలేజీ గేటువద్ద ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీల ఫోటోలను వేలాడదీసి వాటిని చించివేస్తూ నిరసన తెలిపారు. కోల్‌కతా పోలీసు స్టేషన్ ఎదురుగా శుక్రవారం రాత్రి వరకు వారు నిరసన చేపట్టారు. ఈ సమయంలో వారిపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జి చేశారు. మహిళలతో సహా చాలామంది తీవ్రంగా గాయపడ్డారు. పలువురు ఆందోళనకారులను అదుపులోకి కూడా తీసుకున్నారు. రేపిస్టులకు పోలీసులు ఎందుకు కాపలా కాస్తున్నారని ఆందోళనకారులు ప్రశ్నించారు. అభయా మంచాకు చెందిన డాక్టర్లు వెంటనే అక్కడ ఒక క్లినిక్‌ను తెరిచి, గాయపడిన వారికి చికిత్సనందించారు. తాజా సంఘటనతో రాష్ట్రంలో తృణమూల్ దుష్టపాలన మరోసారి బట్టబయలైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం విమర్శించారు.


ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, వివిధ ప్రజా సంఘాల నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఐదుగురు సభ్యులతో సిట్ ఏర్పాటు

దర్యాప్తునకు కోల్‌కతా పోలీసులు ఐదుగురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను శనివారం ఏర్పాటు చేశారు. ఈ సిట్‌కు అసిస్టెంట్ పోలీసు కమిషనర్ ర్యాంక్ అధికారి నేతృత్వం వహిస్తారని సంబంధిత అధికారి తెలిపారు.

ఈ బృందం తక్షణమే తన దర్యాప్తును ప్రారంభిస్తుందన్నారు.

కాలేజీ సెక్యూరిటీ గార్డు అరెస్టు

ఈ ఘటనలో ప్రధాన నిందితులైన సీనియర్ న్యాయ విద్యార్థులు మోనోజిత్ మిశ్రా, జుబీర్ అహ్మద్, ప్రామిత్ ముఖర్జీలను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేయగా, తాజాగా ఆ కాలేజీ సెక్యూరిటీ గార్డ్ పినాకీ బెనర్జీని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ప్రస్తుతం పోలీసులు బెనర్జీని విచారిస్తున్నారు. గార్డ్ రూమలోనే తనపై అత్యాచారం జరిగిందని, సెక్యూరిటీ గార్డ్ తనకెలాంటి సహాయం చేయలేదని బాధితులురాలు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు గార్డ్‌ని అరెస్టు చేశారు.

రాజ్యాంగంపై ఆర్ఎస్ఎస్ దాడి

- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగంపై ఆర్ఎస్ఎస్ దాడికి పూనుకుందని ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ విమర్శించారు. రాజ్యాంగంలోని సెక్యులర్, సోషలిజం పదాలను తొలగించాలన్న ఆర్ఎస్ఎస్ డిమాండ్‌ను ఎఐఎడబ్ల్యుయు తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. శనివారం కోల్‌కతాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్యులర్, సోషలిజం పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ చేసిన డిమాండ్ భారత రాజ్యాంగ ఆత్మను చిదిమేయడమేనని పేర్కొన్నారు. దేశాన్ని మత, కులాధిపత్యం, కార్పొరేట్ రాజ్యం వైపు నెట్టే అతిప్రమాదకరమైన కుట్రలో భాగమే అని విమర్శించారు. పేదల హక్కులను నాశనం చేయాలన్న ప్రయత్నంలో భాగంగానే ఇలాంటి డిమాండ్లను ఆర్ఎస్ఎస్ లేవనెత్తుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐక్యతతో రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగానికి కీలకమైన లక్ష్యాలను తొలగించాలన్న డిమాండ్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని సూచించారు. శ్రమజీవుల హక్కులు, పౌర హక్కులు, స్వేచ్ఛ కోసం హిందుత్వ శక్తులు నుండి దేశాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. అట్టడుగు వర్గాలు, గ్రామీణ పేదలు, వర్గాల పోరాటాలను అఖిల భారత ఉద్యమంగా విస్తరించాలని సూచించారు.

భారత రోదసీ చరిత్రలో నవ శకానికి నాంది!

- శుభాంశు శుక్లాతో మాట్లాడిన ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : భారత వ్యోమగామి, గ్రూపు కెప్టెన్ శుభాంశు శుక్లా రోదసీ ప్రయాణంతో కొత్త శకం ప్రారంభమైందని, భారత్ మానవ సహిత రోదసీ యాత్ర అయిన మిషన్ గగన్‌యాన్ దిశగా తొలి అడుగు పడిందని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ఐఎస్-ఎస్‌లో వున్న శుభాంశుతో శనివారం ప్రధాని వీడియో లింక్ ద్వారా దాదాపు 18 నిమిషాలు మాట్లాడారు. "శుభాంశు...ఈనాడు భరత భూమికి చాలా దూరంలో వున్నావు. కానీ ప్రతి భారతీయుడి హృదయానికి అత్యంత దగ్గరగా వున్నావు." అని ప్రధాని వ్యాఖ్యానించారు. "తన ఈ ప్రయాణం తనదొక్కడిదే కాదని, యావత్ భారతదేశానిదని' శుక్లా ప్రధానితో అన్నారు. ఈ కొత్త అనుభవాలను స్పాంజ్ మాదిరిగా తాను స్వీకరిస్తున్నానని అన్నారు. 'ప్రతీదీ ఇక్కడ భిన్నంగా వుంది.' అని ఆయన వ్యాఖ్యానించారు. భార రహిత స్థితిలో తన అనుభవాలను ఆయన పంచుకున్నారు. ఏడాదిపాటు శిక్షణ పొందాం, అనేక భిన్నమైన వ్యవస్థల గురించి తెలుసుకున్నాం. అయినా ఇక్కడకు వచ్చిన తర్వాత ప్రతీదీ మారిపోతోంది. చాలా చిన్న విషయాలు కూడా రోదసీలో ఎలాంటి గురుత్వాకర్షణ లేని పరిస్థితుల్లో భిన్నంగా వుంటున్నాయన్నారు. నిద్రపోవడమనేది చాలా పెద్ద సవాలుగా వుందన్నారు. ఈ వాతావరణానికి అలవాటుపడడానికి కూడా కొంత సమయం పడుతుందన్నారు.

న్యాయ విద్యార్థిని తక్షణమే విడుదల చేయండి : సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద గత ఏడాది ముందస్తుగా నిర్బంధంలోకి తీసుకున్న న్యాయ విద్యార్థిని తక్షణమే విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇది పూర్తిగా సహించరానిదని వ్యాఖ్యానించింది. ఈ కేసులో కారణాలను వివరిస్తూ సవివరమైన ఆదేశాలు త్వరలో జారీ చేయనున్నట్లు జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. మధ్యప్రదేశ్‌లోని బీటుల్ జిల్లా మేజిస్ట్రేట్ గత ఏడాది జులై 11న జారీ చేసిన ఈ నిర్బంధ ఆదేశాల్లో తప్పు వుందని బెంచ్ పేర్కొంది. బీటుల్‌లో యూనివర్శిటీ కేంపస్‌లో ప్రొఫెసర్‌తో ఘర్షణ జరిగిన నేపథ్యంలో పిటిషనర్ అన్నును పోలీసులు అరెస్టు చేశారు. వెంటనే అన్నుపై హత్యాయత్నం, ఇతర సంబంధిత నేరాల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జైల్లో వుండగా, ఆయనపై ఎన్ఎస్ఎ నిబంధనలను వర్తింపజేస్తూ ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. ఇక అప్పటి నుండి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ నిర్బంధం గడువును పొడిగిస్తున్నారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన రికార్డుల ప్రకారం అన్ను అలియాస్ అనికేత్‌పై ప్రస్తుత కేసుతో సహా తొమ్మిది క్రిమినల్ కేసులు వున్నాయని బెంచ్ తెలిపింది. అందుకే ఎన్ఎస్ఎ కింద అదుపులోకి తీసుకోవాల్సి వచ్చిందంటూ ప్రభుత్వం తన చర్యను సమర్ధించుకుందని బెంచ్ పేర్కొంది. అన్నూ తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ, గత ఎనిమిది కేసులకు గానూ ఐదు కేసుల్లో అన్నూ నిర్దోషి అని తేలిందని, ఒక కేసులో దోషిగా తేలినా జరిమానా మాత్రమే విధించారని తెలిపారు. మిగిలిన రెండు కేసులు పెండింగ్‌లో వున్నాయని, తన క్లయింట్ బెయిల్‌పై వున్నాడని తెలిపారు. ఒక కేసులోనే ప్రస్తుతం నిర్బంధంలో ఉన్నాడని, అందువల్ల విడుదల చేయాలని అభ్యర్థించారు. పిటిషనర్‌ను ఏ కారణాలతో ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారో అవి ఎన్ఎస్ఎ సెక్షన్ 3లోని సబ్ సెక్షన్ (2)కు అనుగుణంగా లేవని బెంచ్ పేర్కొంది. అందువల్ల ఈ చర్య పూర్తిగా సహించరానిదని సుప్రీం బెంచ్ వ్యాఖ్యానించింది. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. మరే ఇతర క్రిమినల్ కేసులో విచారణకు ఆయన అవసరం లేదనుకుంటే భోపాల్ సెంట్రల్ జైలులో వున్న యువకుడిని తక్షణమే విడుదల చేయాలని ధర్మాసనం పేర్కొంది.

మానవతా సాయం ముసుగులో హత్యాకాండ

- సహాయ కేంద్రాల వద్దే 549 మంది మృతి, 4 వేల మందికిపైగా గాయాలు
- ఇజ్రాయిల్ దాష్టీకానికి మరో 60 మంది బలి
- 56 వేలు దాటిన మృతులు

గాజా : అమెరికా అండతో పేట్రేగిపోతున్న ఇజ్రాయిల్ అకృత్యాలకు అంతం లేకుండా పోతోంది. మానవతా సాయం ముసుగులో గాజాలో ఏర్పాటు చేసిన కేంద్రాలను సామూహిక హత్యాకాండ ప్రాంతాలుగా ఇజ్రాయిల్ వినియోగించుకుంటోంది. ఈ విషయాన్ని ఇజ్రాయిల్ సైన్యమే అంగీకరిస్తోంది. గత 24 గంటల్లో ఇజ్రాయిల్ సైన్యం జరిపిన కాల్పుల్లో 103 మంది మరణించారని, 219 మందికి గాయాలయ్యాయని గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. మానవతా సహయ కేంద్రాలు, స్టేడియం, అపార్ట్‌మెంట్ లో తలదాచుకున్న వారి పై దాడులు చేసింది. మృతదేహాలను, గాయపడిన వారిని నాసర్ ఆసుపత్రికి తరలించారు.


గాజా అల్ షఫియా ఆసుపత్రిలో మృతదేహాల వద్ద రోదిస్తున్న పాలస్తీనా మహిళలు

గాజా మంత్రిత్వ శాఖ 2023 అక్టోబర్ నుండి ఇప్పటి వరకు ఇజ్రాయిల్ సైన్యం 56 వేల పైగా పాలస్తీనియన్లను బలితీసుకుంది. వీరిలో 70 శాతానికిపైగా పిల్లలు, మహిళలే. గాజాలోకి ఆహారం, వైద్యం తదితర సహాయం రాకుండా అడ్డుకుంటోంది. తినడానికి ఆహారం లేదని, ఇసుక తింటున్నామని ఓ బాలుడు సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ పాలస్తీనా దుర్భర పరిస్థితికి అద్దం పడుతోంది. ఇతర దేశాలు, స్వచ్ఛంద సంస్థలు, ఐక్య రాజ్య సమితి నుంచి వస్తున్న మానవతా సాయాన్ని అనుమతించడం లేదు. ఇటీవల ప్రముఖ ఉద్యమకారిణి గ్రేటాథన్ బర్గ్ సహా కొందరు ఉద్యమకారులు సహాయం తీసుకొచ్చేందుకు ప్రయత్నించినా, అడ్డుకుని వెనక్కి పంపివేసింది. ఈ ఏడాది మే నుండి గాజా హ్యూమానిటేరియన్ సంస్థ పేరుతో అమెరికా మద్దతుతో అరకొరగా సాయం అందిస్తున్నారు. ఆకలితో అక్కడికి వచ్చి, ఖాళీ పాత్రలతో వేచిచూస్తున్న వారిపై విచక్షణా రహితంగా ఇజ్రాయిల్ సైన్యం కాల్పులు జరిపి ఇప్పటి వరకు 549 మందిని హత్య చేసిందని, 4000 మందికి పైగా గాయపడ్డారని గాజా ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు.

కాల్చివేయాలని ఆదేశించారు : ఇజ్రాయిల్ సైనికులు

పాలస్తీనా వామపక్ష పత్రిక హారెట్జ్ శుక్రవారం ప్రచురించిన కథనం ఇజ్రాయిల్ దుర్మార్గాలను అద్దం పడుతోంది. మానవతా సహాయ కేంద్రాలపై కాల్పులు జరపాలని తమకు పై అధికారుల నుండి స్పష్టమైన ఆదేశాలున్నాయని, సహాయ కేంద్రాలు తెరవడానికి ముందే అక్కడికి చేరుకున్న వారిపై కాల్పులు జరిపామని, మూసివేసిన అనంతరం చెదరగొడుతూ దాడులు చేశామని ఇజ్రాయిల్ సైనికులు తెలిపినట్లు వెల్లడించింది. దీన్ని నెతన్యాహు ఖండించారు. దాడులు చేయలేదని, పౌరులెవ్వరూ మృతి చెందలేదని ప్రకటించారు. డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్ సంస్థ "మానవతా సాయం ముసుగులో హత్యాకాండ" గా సహాయ పంపిణీ కేంద్రాలను అభివర్ణించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం ఓవల్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గాజా పై సంప్రదింపులు జరుగుతున్నాయని, వచ్చేవారం కాల్పుల విరమణకు ప్రయత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. హమాస్ కాల్పుల విరమణకు సిద్ధమని ఇప్పటికే ప్రకటించింది. ఇజ్రాయిల్ తక్షణమే దాడులను ఆపాలని కోరుతుంది. నెతన్యాహూ తన రాజకీయ అవసరాల కోసం అమాయకుల హత్యలను కొనసాగించడం గమనార్హం.

వేలాదిమంది ఇరానియన్ల అశ్రు నివాళి!

- ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన కమాండర్లు, శాస్త్రవేత్తల అంత్యక్రియలు
- ఒప్పందం కావాలంటే ఖమేనీ పట్ల గౌరవంగా మాట్లాడాలి : ట్రంప్‌నకు ఇరాన్ హెచ్చరిక

టెహరాన్ : ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన మిలటరీ కమాండర్లు, అణు శాస్త్రవేత్తలు, మరికొంతమంది పౌరులకు వేలాదిగా ఇరాన్ ప్రజలు అశ్రు నివాళి అర్పించారు. ఇజ్రాయిల్ ఇటీవల జరిపిన దాడుల్లో మరణించిన వీరికి శనివారం అంతిమయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నల్ల దుస్తులు ధరించి, ఇరాన్ పతాకాలు చేబూని వేలాదిమంది ప్రజలు టెహరాన్ వీధుల్లో శనివారం ఉదయం జరిగిన అంతిమయాత్రలో పాల్గొన్నారు. మరణించిన కమాండర్లు సైనిక యూనిఫారాల్లో వున్న ఫోటోలతో ఇరాన్ పతాకాలు కప్పిన శవపేటికలతో సాగిన అంతిమయాత్రను ప్రభుత్వ టివి ప్రసారం చేసింది. నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులతో సహా మొత్తంగా 60మంది అంత్యక్రియలు శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. 12 రోజుల పాటు యుద్ధం సాగిన అనంతరం ఉభయ పక్షాల మధ్య కాల్పుల విరమణ జరిగింది.


ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన సైనిక సిబ్బంది, ఇతరుల శవపేటికలను ఇరాన్‌లోని మషాద్‌లో ట్రక్కులో తీసుకెళ్తున్న దృశ్యం

ఖమేని పట్ల మర్యాదగా మాట్లాడాలి : ఇరాన్ మంత్రి అబ్బాస్

తమ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ పట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గౌరవంతో, మర్యాదగా మాట్లాడాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి హెచ్చరించారు. అణు ఒప్పందం కుదరాలంటే నిజాయితీగా ఉండాలని, అగౌరవంగా మాట్లాడకూడదని తెలిపారు. ఇరానీయన్లు బెదిరింపులు, అవమానాలకు లొంగిపోరని తేల్చి చెప్పారు.

అమెరికాతో అణు చర్చలను తిరిగి ప్రారంభించేదిలేదని స్పష్టం చేశారు. ఒప్పందం కావాలంటే మర్యాదగా మాట్లాడాల్సిందేనన్నారు. ఖమేనీని చంపకుండా రక్షించామని, ఆయనకు కృతజ్ఞత లేదని ట్రంప్ ఇటీవల ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ట్రంప్ వ్యాఖ్యలతో ఇరాన్‌లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

అన్నదాతా.. దోబూచులాట

(మొదటి పేజీ తరువాయి)

అర్హులను గుర్తిస్తారన్న ప్రశ్న తలెత్తుతోంది. పిఎంకిసాన్‌కు కేంద్రం నిర్ధారించిన నిబంధనలనే ఖరారు చేస్తారని తెలుస్తోంది. కేంద్రం ఇ-కెవైసి సహా పలు నిబంధనలు విధించింది. స్వంత భూమి కలిగిన వారికే ఇస్తోంది. తమ మాటేమిటని కౌలు రైతులు ఆందోళనగా ఉన్నారు. కౌలు రైతుల గుర్తింపునకు సిసిఆర్‌సి చట్టం ఆటంకంగా ఉంది. ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం అంగీకరించి కొత్త చట్టం తెస్తామని ప్రకటించింది. ఏడాదైనా అతీగతీ లేదు. గుర్తింపు కార్డు, ఇ-పంటలో నమోదు తప్పనిసరి చేసినట్లు చెబుతున్నారు. పాత చట్టం ప్రకారం కౌలు రైతులను గుర్తిస్తే నామమాత్రపు సంఖ్యకే అన్నదాతా.. లబ్ధి చేకూరుతుంది.

కోతలే కోతలు

కేంద్రం పిఎంకిసాన్‌కు విధించిన ఆంక్షలతో లబ్ధిదారులు అంతకంతకూ తగ్గిపోతున్నారు. 2024-25లో కేంద్రం రెండు వేల చొప్పున మూడు కిస్తులు జమ చేయగా లబ్ధిదారుల సంఖ్య ఒక్కో విడతలో 41 లక్షలకు మించలేదు.

గత వైసిపి ప్రభుత్వం తన వాటా కింద దాదాపు 50 లక్షల మంది స్వంత భూమి దారులకు సొమ్ము జమ చేసింది. పది లక్షల మంది తగ్గిపోయారు. గత ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు లబ్ధి లక్ష లోపుగానే ఉంది. పాత చట్టం, పాత నిబంధనలే ఇప్పుడూ అమలయ్యేటట్లయితే వాస్తవంగా భూమిపై సాగు చేస్తున్న అర్హులైన రైతులు, కౌలు రైతులందరికీ సర్కారీ సాయం అందే పరిస్థితి లేదు.

కాల్పుల విరమణ ఉల్లంఘన

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ విమర్శించారు. దక్షిణ లెబనాన్‌లో ఎలాంటి ప్రభుత్వ ఆయుధాలు లేదా పోరు బాట పట్టే కార్యకర్తలు వుండరాదని కాల్పుల విరమణ ఒప్పందం పేర్కొంటోంది. ఇజ్రాయిల్ సైనికులు దక్షిణ లెబనాన్‌ను వీడాలని స్పష్టం చేస్తోంది. ఎందుకంటే అక్కడ లెబనాన్ బలగాలను మోహరించాల్సి వుంది. ఒప్పందం నేపథ్యంలో ఏడాదికి పైగా ఇజ్రాయిల్, లెబనాన్ మధ్య కాల్పులు నిలిచిపోగా, రెండు మాసాల నుండి యుద్ధం ఆగిపోయింది. తాజాగా దాడులు చేయడం ద్వారా ఇజ్రాయిల్ మరోసారి తన దురహంకార పూరిత వైఖరిని బయటపెట్టుకుంది.

దర్యాప్తు అధికారికి ఎక్స్ కేటగిరీ భద్రత

న్యూఢిల్లీ : అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్న అధికారికి ఎక్స్ కేటగిరీ భద్రతను కేంద్రం కల్పించింది. ఈ నెల 12న జరిగిన దుర్ఘటనలో 260 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్న బృందానికి నాయకత్వం వహిస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో చీఫ్ జివిజి యుగంధర్‌కు 'ఎక్స్' కేటగిరీ భద్రతను కల్పిస్తోంది.

చివరి మృతుడినీ గుర్తించాం : అధికారులు

విమాన ప్రమాదంలో 260 మంది మృతులను డిఎన్ఎ టెస్ట్ ద్వారా గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు అధికారులు శనివారం ప్రకటించారు. విమాన ప్రమాదంలో మరణించిన చివరి మృతదేహం డిఎన్ఎ సరిపోలడంతో బంధువులకు అప్పగించినట్లు అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ జోషి తెలిపారు.

పిల్లల్ని కనండి...! అందుకు ప్రభుత్వం ఏం చేయాలి?

(మొదటి పేజీ తరువాయి)

దానిని ఎంచుకోవాలని సూచించింది. ఒకరికన్నా ఎక్కువ మంది పిల్లలు కావాలనుకుంటున్న దంపతులు ఎదుర్కుంటున్న అతి పెద్ద సవాల్ ఏమిటన్నది కూడా మరో ప్రశ్న! దీనికి అధిక ఖర్చులు (ఇల్లు, విద్య, ఆరోగ్యం), స్థిరమైన ఉద్యోగం, ఆదాయం లేకపోవడం, సంతాన సామర్థ్యం తగ్గడం-ఇతర ఆరోగ్య సమస్యలు, కుటుంబం, సమాజం, ప్రభుత్వ నుండి సరైన తోడ్పాటు అందకపోవడం, , జీవన విధానాల మార్పులు, ఇతరాలను జవాబులుగా ఇచ్చి ఒక దానికి ఎంచుకోవాలని కోరింది. పిల్లలు సక్రమంగా ఎదగడానికి ఉమ్మడి కుటుంబం మంచిదేనా అని, వర్కింగ్ ఉమెన్‌కు ప్రభుత్వం నుండి ఎటువంటి సాయంకావాలని ప్రశ్నించింది. రాష్ట్రంలో యువత సంఖ్య తగ్గుతున్న విషయం తెలుసా? దీనికి కారణం ఏమిటని భావిస్తున్నారు?వృద్ధులకు ఎటువంటి సాయం అందిస్తే బాగుంటుంది అన్న ప్రశ్నలు కూడా ఈ సర్వేలో ఉన్నాయి. క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో వివరాలు సేకరిస్తుండగా, కొంతమందికి నేరుగా సంక్షిప్త సమాచార విధానంతో కోరిడా అభిప్రాయాలను అడిగి తీసుకుంటోంది.

జీవన సౌరభం

కాలం విలువను గ్రహించని వాడు జీవితం విలువను అర్థం చేసుకోలేడు.

మీ కోసం

వంటగదిలో ఉపయోగించే నాప్‌కిన్లకు పొరపాటున మంట అంటుకుంటే దానిపై ఉప్పు చల్లితే ఆరిపోతుంది.



ఉపాయముంటే!



ఒక అడవిలో బోలెడు పక్షులు, జంతువులు కలిసిమెలిసి జీవిస్తున్నాయి. అక్కడ టాటూమా అనే అమ్మాయి కూడా ఉంది. తన దగ్గర ఒక పిడికత్తి ఉంది. దాంతో టాటూమా అడవిలో పిచ్చిపిచ్చిగా పెరిగిపోయిన కలుపుమొక్కలను తుంచుతుంది. మంచి మొక్కలను సంరక్షిస్తుంది. పక్షులు, జంతువులతో టాటూమాకి మంచి స్నేహం ఉంది.

ఒకసారి ఆ అడవికి 'భయంకర' అనే పేరు గల రాక్షసుడు వచ్చాడు. అతడు వచ్చిన దగ్గర నుండి కనిపించిన పక్షులను, జంతువులను తినేశాడు. భయంకరుడి వలన అడవిలో ఆటపాటలు కరువై పోయాయి. అతడి బారిన పడకుండా, జంతువులు, పక్షులు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాయి.

ఒకరోజు 'టాటూమా'తో అవన్నీ తమగోడు వెళ్లబోసుకున్నాయి. 'ఆ రాక్షసుడు అడవిలో ఉన్నంతవరకూ, మనం ఆడలేము. పాడలేము. ఆనందంగా ఉండలేము. ఇలా రోజూ, భయపడుతూ బతకాల్సిందేనా?' అని బాధగా అడిగాయి.

అప్పుడే 'చిట్టి' అనే 'చిట్టి చిలుక 'టాటూమా చేతి మీద వాలింది. అప్పుడు టాటూమా చేతిలో నున్న పిడి కత్తి కింద పడింది. ఆ కత్తిని తీసుకుంటూ, 'చిట్టి అల్లరి చేయకు' అంది టాటూమా. అంతలోనే టాటూమాకు ఒక ఆలోచన మెరిసింది.

'ఉపాయం ఉంటే ఎంతటి అపాయాన్నైనా జయించవచ్చు. త్వరలోనే భయంకరుడి బాధ లేకుండా చేస్తాను' అని పక్షులకు ధైర్యం చెప్పింది. ఒకరోజు అలవాటులో భాగంగా, భయంకరుడు ఆహారం కోసం బయటకు వచ్చాడు.

ఎదురుగా టాటూమా కనబడింది. టాటూమాని చూడగానే తనని తినాలని భయంకరుడు నోరు పెద్దగా తెరిచాడు. టాటూమాను అమాంతం మింగేసాడు. చెట్టు చాటున్న పక్షులన్నీ, భయపడుతూ 'టాటూమా జాడ మనకు కనబడదు. అయ్యో అంటూ బాధపడ్డాయి. అయితే రాక్షసుడి పొట్టలోకెళ్ళిన టాటూమా క్షణం కూడా ఆలస్యం చేయకుండా, తన చేతికి చుట్టుకున్న పిడి కత్తితో భయంకరుడి పొట్ట లోకి బలంగా పొడిచింది. రాక్షసుడి పొట్ట పగిలింది.


టాటూమా ప్రాణాలతో బయటపడింది. 'హమ్మయ్య! రాక్షసుడి పీడ విరగడ అయిందంటూ' పక్షులన్నీ ఆనందంతో ఎగిరాయి. ఉపాయంతో భయంకరుడిని అంతం చేసిన టాటూమా తెలివిని మెచ్చుకున్నాయి.



- నల్లా అంబిక,
5వ తరగతి,
మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల,
నల్లచెరువు గ్రామం, అయినవిల్లి మండలం,
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా,
92477 40876.

నేను గీసిన బొమ్మ






ఆరిపాక త్రివిక్రమ్,
7వ తరగతి,
శ్రీ వేణు విద్య నికేతన్,
కే కోటపాడు,
అనకాపల్లి జిల్లా.

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. గుర్తించండి చూద్దాం.





పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆ పిల్లలు.. స్కూలుకి వెళ్లడం లేదు..



ప్రతి ఇంట్లో స్కూలు పిల్లల హడావిడి కనిపిస్తోంది. అమ్మ ఒడి నుండి ఇప్పుడే నడక నేర్చుకున్న బుడతలు కూడా స్కూలు వ్యానులో ఎంచక్కా బడికి పోతున్నారు. గోరు ముద్దలు తింటూ, ఆడుతూ, పాడుతూ, గెంతులు వేస్తున్న చిన్నారులను చూస్తున్న పెద్దల ఆనందం అంతా ఇంతా కాదు.. ఇదంతా మన కళ్ల ముందు కనిపిస్తున్న దృశ్యాలు. అయితే మన కంటికి కనిపించినంత దూరంలో ఉన్న పిల్లల పరిస్థితి వేరేలా ఉంది. భయంకరమైన పరిస్థితుల్లో వాళ్లు జీవిస్తున్నారు. హింస, సంఘర్షణ, భయం, మానవ హక్కుల ఉల్లంఘనలతో ఉన్న ఊరిని, దేశాన్ని విడిచి వారు వెళ్లిపోతున్నారు. సముద్రాల వెంట, అడవుల గుండా, ఎడారుల మీదుగా, పర్వతాల అంచున భయంకరమైన వాతావరణంలో వేల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్నారు. అమ్మకి, నాన్నకి దూరంగా, తోబుట్టువుల సాహచర్యానికి నోచుకోకుండా ఎక్కడో ఓ పరాయి దేశంలో శరణార్థులుగా దుర్భరబతుకు బతుకుతున్నారు. ఈ పిల్లల్లో చాలామంది స్కూలుకెళ్లే వయసువారే. ఇప్పుడు వాళ్లంతా స్కూలుకి వెళ్లడం లేదు. తిండి కోసం, నీళ్ల కోసం, బట్టల కోసం, బతుకు కోసం.. సాయం చేసే ఆపన్న హస్తాల వైపు దీనంగా చూస్తున్నారు.


సమీర్.. 17 ఏళ్ల వాడు. ఆఫ్ఘనిస్తాన్ అష్రఫ్ ఘని ప్రభుత్వంలో తన తండ్రి ఉన్నత బాధ్యతల్లో ఉండేవాడు. స్కూలుకి వెళ్లడం, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకోవడం సమీర్ దినచర్య. మంచి ఫైటర్‌గా క్రీడల్లో రాణించాలని ఎన్నో కలలుకన్నాడు. కానీ, ఎప్పుడైతే తాలిబన్లు ఆఫ్ఘన్‌ని స్వాధీనపరుచుకున్నారో అప్పటి నుండీ సమీర్ జీవితం తలకిందులైంది. తాలిబన్ల చెరలో దినదినగండంగా ఉన్న రోజుల నుండి బతికి బయటపడాలని సమీర్ కుటుంబం దేశం విడిచి పారిపోయింది. ఇక్కడి నుండే తన జీవితం మరో దుర్భర పరిస్థితుల్లోకి నెట్టివేయబడింది.

వంద మందిలో 33 మంది చిన్నారులే..

సంఘర్షణలు, హింస వంటి కారణాలతో దేశం విడిచి పారిపోతున్న, వెళ్లిపోతున్న శరణార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు. 'యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్(యుఎన్‌హెచ్‌సిఆర్)' నివేదిక ప్రకారం 2024 నాటికి ప్రపంచంలో 4 కోట్ల పది లక్షలమంది శరణార్థులు ఉన్నారు. వారిలో 1 కోటీ 33 లక్షల మంది చిన్నారులు. ఈ సంఖ్య బెల్జియం, స్వీడన్, పోర్చుగల్, గ్రీస్ దేశాల జనాభా కంటే ఎక్కువ. ప్రతి 100 మంది శరణార్థులకు 33 మంది పిల్లలు ఉన్నారు.

నివేదిక ప్రకారం వీరిలో 68 లక్షల మంది బాలురు, 65 లక్షల మంది బాలికలు ఉన్నారు. లింగం ఆధారంగా వీరు ఎదుర్కొంటున్న హింస, దాడులు వేర్వేరుగా ఉన్నాయి. బాలికలు, లైంగికంగా, శారీరక, మానసిక దాడులకు గురవుతున్నారు. బాలురు భౌతిక దాడులతో, హింస, వేధింపులతో జీవిస్తున్నారు.

సంరక్షణకి దూరంగా



నివేదిక ప్రకారం మొత్తం శరణార్థ చిన్నారుల్లో 59 లక్షల మంది 5 నుండి 11 ఏళ్ల మధ్య వారు. 42 లక్షల మంది 12 నుండి 17 ఏళ్ల వారు. 32 లక్షల మంది ఏడాది నుండి 4 ఏళ్ల లోపు వారు. ఈ వయసు పిల్లలు తల్లిదండ్రులు, సంరక్షకుల మధ్య పెరగాలి. వాళ్ల హక్కులని అనుభవించాలి. పోషకాహారం తీసుకోవాలి. ఆడుకోవాలి. చదువుకోవాలి. కానీ ఇవేవీ ఆ పిల్లలకు అందడం లేదు. స్కూలుకి వెళ్లే ఆ పిల్లలంతా తీవ్ర శారీరక, మానసిక అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు.

1951లో ఐక్యరాజ్యసమితి శరణార్థుల సదస్సును ప్రారంభించే సమయానికి శరణార్థుల సంఖ్య 21 లక్షలుగా ఉంది. ప్రస్తుతం ఆ సంఖ్య 20 రెట్లు పెరిగింది. 1951లో 1190 మంది ప్రజలకు 1 శరణార్థి ఉన్నారు. ఇప్పుడు ప్రతి 185 మందికి ఒకరు శరణార్థిగా మారిపోతున్నారు.

నెలల తరబడి.. వేల కిలోమీటర్లు..

నివేదిక ప్రకారం శరణార్థ చిన్నారుల్లో సగం మంది వేల కిలోమీటర్లు ప్రయాణించి ఆతిథ్య దేశాలను చేరుకుంటున్నారు. సమీర్ కూడా అలాగే ఆఫ్ఘన్ నుండి యునైటెడ్ కింగ్‌డమ్ చేరుకోవడానికి 2 వేల కిలోమీటర్ల దూరాన్ని 18 నెలలు పాటు ప్రయాణించాడు. ప్రతి 10 మంది శరణార్థ చిన్నారుల్లో 9 మంది 500 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణిస్తున్నారు. సాధారణంగా ఈ దూరం చేరడానికి 10 నుండి 12 గంటలు డ్రైవింగ్ చేస్తే చాలు. అదే విమానంలో అయితే రెండుగంటల్లో చేరుకోవచ్చు. కానీ శరణార్థులు కాలినడకన సముద్రాలు, ఎడారులు, అడవులు, పర్వతాల గుండా వివిధ దేశాలు దాటుకుని ప్రయాణిస్తున్నారు. ఈ ప్రయాణంలో వారికి ఎన్నో చేదు అనుభవాలు ఎదురవుతాయి. ప్రమాదాల్లో మరణించేవారు కొందరైతే, దాడలతో చంపబడుతున్నవారు మరికొందరు.

ఒకరికి ఒకరు దూరంగా..

ఆతిథ్య దేశానికి చేరుకున్న తరువాత వాళ్ల కష్టాలు మరో రూపంలోకి మారతాయి. అక్కడ ఇరుకైన గుడారాల్లో వందల్లో, వేలల్లో శరణార్థుల మధ్య జీవించాలి. ఈ మధ్యలో కుటుంబాలతో వచ్చిన వారిని వేరుచేసి శిబిరాలకు పంపుతారు. అంటే అప్పటి వరకు చస్తూ, బతుకుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వచ్చిన ఆ కుటుంబాల్లో తల్లులకు పిల్లలు దూరమవుతారు. వేల కిలోమీటర్లు పట్టుకున్న చెయ్యిని విడవకుండా వచ్చిన తోబుట్టువులు ఒకరికి ఒకరు కనిపించినంత దూరానికి నెట్టివేయబడతారు.

యునైటెడ్ కింగ్‌డమ్ చేరుకునే సరికి తన తమ్ముడి నుండి దూరంగా వేరే శరణార్థ శిబిరానికి సమీర్‌ని తరలించారు. నివేదికలో సమీర్ ప్రస్తుత మానసిక పరిస్థితిని కూడా ప్రస్తావించారు. 'తమ్ముడు ఎక్కడ ఉన్నాడో.. ఏమయ్యాడో తెలియదు.. అసలు ఉన్నాడో, లేదో కూడా అర్థం కావడం లేదు. ఈ పరిస్థితుల్లో నేను వాడ్ని ఎప్పటికి కలుసుకుంటానో.. 18 నెలలు మేమిద్దరం ఒకరి చేయి ఒకరం పట్టుకుని నడిచాం. ఇప్పుడు ఆ భయంకర రోజులను తలచుకున్నా, ఎందుకో సంతోషంగా ఉంటోంది. 'తమ్ముడు నా దగ్గర లేడు' అన్న నిజం గుర్తుకొచ్చినప్పుడల్లా దు:ఖం ఆగడం లేదు' అంటున్న సమీర్ లాంటి అన్నలు, తమ్ముళ్లు ఆ శరణార్థుల శిబిరాల్లో కోకొల్లలుగా కనిపిస్తారు.

విద్య లేదు.. భవిష్యత్తూ లేదు..

శరణార్థ శిబిరాల్లో జీవిస్తున్న పిల్లలకు అనారోగ్య సమస్యలతో పాటు మానసిక ఒత్తిడి తీవ్రంగా పెరిగిపోతోంది. ఆ బాధ నుండి వారిని బయటపడవేసే దారులు ఎక్కడా కనిపించడం లేదు. విద్యకి దూరమైన ఆ చిన్నారులు భవిష్యత్తు లేక బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

ప్రపంచంలో పెరిగిపోతున్న యుద్ధ సంస్కృతి, దాడులు, ఆర్థిక సంక్షోభం పిల్లలను వాళ్ల ప్రపంచం నుండి దూరంగా విసిరేస్తోంది. ఈ కష్టం, నష్టం ఆ పిల్లలను ఎంతటి విపరీత పరిస్థితుల్లోకి నెట్టేస్తోందో అంచనా వేయడం కష్టం. ఆ పిల్లల కలలను, ఆకాంక్షలను సంరక్షించేలా, వాళ్ల భవిష్యత్తుకి భరోసా ఇవ్వడమే ప్రపంచం ముందున్న ఏకైక లక్ష్యం.



'తమ్ముడు' న్యూ పోస్టర్

నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ కాంబోలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. సప్తమి గౌడ, వర్ష బొల్లమ్మ హీరోయిన్స్‌గా చేస్తున్నారు. సీనియర్ నటి లయ కీలక పాత్రలో నటించారు. ఈ చిత్రం వచ్చే వారం రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. తాజాగా ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు వారు 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ విషయాన్ని సోషల్‌మీడియాలో ఓ పోస్టర్ ద్వారా చిత్రబృందం షేర్ చేసింది. ఈ సినిమాకి అజనీష్ లోకనాథ్ సంగీతం అందించగా దిల్ రాజు, శిరీష్ నిర్మాణం వహించారు. జూలై 4న సినిమా విడుదలకాబోతోంది.

'ది ప్యారడైజ్' నాని..

నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకున్నాడు దర్శకుడు శ్రీకాంత్. ఈ సినిమా సెట్స్‌లోకి నాని ఎంటర్ అయినట్లు ఓ పోస్టర్ ద్వారా తెలిపారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రం తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో వచ్చే ఏడాది (2026) మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రం 1980ల కాలంలో హైదరాబాద్‌లో జరిగిన కొన్ని నిజమైన సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్నట్లు సమాచారం. ఇది ఒక యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతోంది.



'3 బిహెచ్‌కె' సినిమాను ఆదరించండి : సిద్ధార్థ్



'3 బిహెచ్‌కె' మూవీ ఫ్యామిలీని మీకు పరిచయం చేయాలి. అరుణ్ విశ్వ ఎక్సైటింగ్ ప్రొడ్యూసర్. ఈ సినిమా ఒక రియల్ లైఫ్ నుంచి వచ్చిన కథ. తండ్రి కొడుకుల అనుబంధాన్ని బొమ్మరిల్లు సినిమాలో చూశారు. ఆ సినిమా నాకు చాలా నేర్పించింది. అలాంటి సినిమా తర్వాత మళ్ళీ తండ్రి కొడుకుల రిలేషన్షిఫ్ 3 బీహెచ్‌కే లో చూస్తారు. ఈ సినిమా చూసినప్పుడు నాకు ఎలాంటి అనుభూతి కలిగిందో మీకు కూడా ఆ అనుభూతి కలుగుతుందని భావిస్తున్నాను. మీ ఫ్యామిలీని తీసుకుని థియేటర్లకు వెళ్ళండి. శ్రీ గణేష్ చాలా ఫేమస్ రచయిత, దర్శకుడు. ఆయన ఈ కథ చెప్పినప్పుడే చాలా ఎమోషనల్‌గా అనిపించింది. సొంత ఇల్లు అందరి కల. నేను కూడా చిన్నప్పుడు మా సొంతిల్లు కోసం ఎదురు చూశాను. మనందరం అలాంటి మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్ నుంచే వచ్చాం. ఈ సినిమాలో మెయిన్ క్యారెక్టర్ ఇల్లు. ఆ తర్వాత శరత్‌కుమార్, దేవయాని. మంచి ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఇందులో ఉంది. ఈ సినిమాని కళాతపస్వి కె.విశ్వనాథ్ గారికి అంకితం చేస్తున్నాం' అని కథానాయకుడు సిద్ధార్థ్ అన్నారు. కథానాయకుడు సిద్ధార్థ్ 40వ మూవీ '3 బిహెచ్‌కె'. శ్రీ గణేష్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే పోస్టర్లు, టీజర్లు, పాటలు విడుదలై సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌లో ఉన్నాయి. యోగిబాబు, మీతా రఘునాథ్, చైత్ర ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. శాంతి టాకీస్ బ్యానర్‌పై అరుణ్ విశ్వ నిర్మించారు. శనివారంనాడు ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను మేకర్లు విడుదల చేశారు. జులై నాలుగోతేదీన ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.



మరో సంజయ్ రామస్వామిలా..

సూర్య, వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ భారీ ప్రాజెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ 'సూర్య-46' వర్కింగ్ టైటిల్‌తో రాబోతుంది. ఇందులో సూర్య సరసన మమిత బైజు హీరోయిన్‌గా చేస్తున్నారు. రవీనా టాండన్, రాధిక కీలక పాత్రలో కనిపించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. జూలై నుండి ఈ చిత్ర షూటింగ్ మొదలుకాబోతుంది. ఈ నేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వెంకీ అట్లూరి చిత్రవిశేషాలు చెప్పారు. 'చాలా రోజుల తర్వాత హ్యాపీ ఫ్యామిలీ సినిమాలో సూర్యను చూడబోతున్నారు. ఇందులో అన్ని ఎమోషన్స్ కలిగి ఉంటాయి. హీరో కామన్ మ్యాన్‌లా ఉండడు.. మరో సంజయ్ రామస్వామి క్యారెక్టర్‌లో సూర్యను చూస్తారు' అని అన్నారు.

మంధాన రికార్డు సెంచరీ

తొలి టి20లో ఇంగ్లండ్‌పై 93పరుగుల తేడాతో గెలుపు



నాటింగ్‌హామ్: టి20ల్లో భారత కెప్టెన్ స్మృ తి మంధాన రికార్డు శతకంతో చెలరేగింది. దీంతో నాటింగ్‌హామ్ వేదికగా ఇంగ్లండ్ మహిళలతో జరిగిన తొలి టి20లో భారతజట్టు 97పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. అనంతరం ఇంగ్లండ్‌ను 14.5ఓవర్లలో 113 పరుగులకే పరిమితం చేసి ఈ ఫార్మాట్‌లో ఇంగ్లండ్‌పై భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ మ్యాచ్‌కు దూరం కాగా.. పగ్గాలు అందుకున్న స్మృతి మంధాన టి20ల్లో తొలి సెంచరీతోపాటు ఓవరాల్‌గా 62బంతుల్లో 15ఫోర్లు, 3సిక్సర్ల సాయంతో 112 పరుగులు చేసి ఎక్లేస్టోన్ బౌలింగ్‌లో స్కీవర్ బ్రంట్ క్యాచ్ అందుకోవడంతో పెవీలియన్‌కు చేరింది. అంతకు ముందు ఓపెనర్ షెఫాలీ వర్మ(20)తో కలిసి మంధాన 8.3ఓవర్లలో 77పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత షెఫాలీ ఔటైనా.. హర్లీన్ డియోల్‌తో కలిసి మరో 96పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి టీమిండియా భారీస్కోర్‌కు బాటలు వేసింది. లారెన్ బౌలింగ్‌లో రెండు ఫోర్లలో సెంచరీ పూర్తి చేసుకున్నారు. ధాటిగా ఆడే క్రమంలో రీచా ఘోష్(12), రోడ్రిగ్స్(0) ఔట య్యారు. ఇంగ్లండ్ బౌలర్లు లారెన్ బెల్‌కు మూడు, అర్లాట్, ఎక్లేస్టోన్‌కు ఒక్కోవికెట్ దక్కాయి.

అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్‌లలో సెంచరీలు కొట్టిన మహిళా క్రికెటర్లు...

1. హీథర్ నైట్(ఇంగ్లండ్)
2. టామీ బ్యూమౌంట్(ఇంగ్లండ్)
3. లారా వోవార్డ్(దక్షిణాఫ్రికా)
4. బెత్ మూనీ(ఆస్ట్రేలియా)
5. స్మృతి మంధాన(ఇండియా)

భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ జట్టును శ్రీఛరాని(4/12), దీప్తి శర్మ(2/32) కట్టడి చేశారు. దీంతో ఇంగ్లండ్ మహిళల జట్టు 14.5ఓవర్లలో 113పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ కెప్టెన్ స్కీవర్ బ్రంట్(66) మినహా.. మిగిలిన ఏ ఒక్క బ్యాటరూ రాణించలేక పోయారు. దీంతో ఐదు టి20ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యతలో నిలువగా.. రెండో టి20 మంగళవారం జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్మృతి మంధానకు దక్కింది.

స్కోర్‌బోర్డు...

భారత మహిళల ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (సి)ఎక్లేస్టోన్ (బి)అర్లాట్ 20, మంధాన (సి)స్కీవర్ బ్రంట్ (బి)ఎక్లేస్టోన్ 112, హర్లీన్ డియోల్ (సి)అర్లాట్ (బి)లారెన్ బెల్ 43, రీచా ఘోష్ (సి)సోఫీ డోంకీ (బి)లారెన్ బెల్ 12, రోడ్రిగ్స్ (సి)స్కీవర్ బ్రంట్ (బి)లారెన్ బెల్ 0, అమన్‌జ్యోత్ కౌర్ (నాటౌట్) 3, దీప్తి శర్మ (నాటౌట్) 7, అదనం 13. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 210 పరుగులు. **వికెట్ల పతనం:** 1/77, 2/171, 3/186, 4/190, 5/202 **బౌలింగ్:** లారెన్ బెల్ 4-0-27-3, అర్లాట్ 4-0-38-1, లారెన్ ఫిలెర్ 4-0-35-0, స్మిత్ 3-0-41-0, ఎక్లేస్టోన్ 3-0-43-1, క్యాప్సే 2-0-21-0.

ఇంగ్లండ్ మహిళల ఇన్నింగ్స్: డోంక్లే (సి)రీచా (బి)అమన్‌జ్యోత్ 7, వాట్ (సి)హర్లిన్ (బి)దీప్తి 0, స్కీవర్ బ్రంట్ (సి)రీచా (బి)శ్రీచరాణి 66, బ్యూమౌంట్ (బి)దీప్తి శర్మ 10, అమీ జోన్స్ (స్టంప్)రీచా (బి)రాధా యాదవ్ 1, అలైసే కాప్సే (సి)అరుంధతి రెడ్డి (బి)శ్రీచరాణి 5, అర్లోట్ (సి)మంధాన (బి)రాధా యాదవ్ 12, ఎక్లేస్టోన్ (సి)రోడ్రిగ్స్ (బి)శ్రీచరాణి 1, ఫిలెర్ (సి)రీచా (బి)అరుంధతి 2, స్మిత్ (నాటౌట్) 0, బెల్ (సి)రోడ్రిగ్స్ (బి)శ్రీచరాణి 2, అదనం 7. (14.5ఓవర్లలో ఆలౌట్) 113పరుగులు. **వికెట్ల పతనం:** 1/9, 2/9, 3/58, 4/62, 5/70, 6/88, 7/102, 8/111, 9/111, 10/113 **బౌలింగ్:** అమన్‌జ్యోత్ కౌర్ 2-0-22-1, దీప్తి శర్మ 3-0-32-2, శ్రీచరాణి 3.5-0-12-4, అరుంధతి రెడ్డి 2-0-18-1, రాధా యాదవ్ 2-0-15-2, స్నేహ్ రాణా 2-0-13-0.

రెండో టెస్ట్‌లో లంక గెలుపు

సిరీస్ 1-0తో కైవసం
బంగ్లాదేశ్ కెప్టెన్సీకి శాంటో గుడ్‌బై



టెస్ట్ సిరీస్ ట్రోఫీతో శ్రీలంక ఆటగాళ్లు

కొలంబో: రెండో, చివరి టెస్ట్‌లో ఆతిథ్య శ్రీలంక జట్టు ఇన్నింగ్స్ 78 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. శనివారం బంగ్లాదేశ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 133పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 6 వికెట్ల నష్టానికి 115 పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ జట్టు 133 పరుగులకు కుప్పకూలింది. ముష్ఫికర్(26), లింటన్ దాస్(14), మెహిదీ హసన్(11) మాత్రమే రెండంకెల స్కోర్ చేయగా.. లోయర్ ఆర్డర్ బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. శ్రీలంక బౌలర్లు ప్రభాత్ జయసూరియకు ఐదు, ధనుంజయ, టి.రత్నాయకేకు రెండేసి వికెట్లు దక్కాయి. దీంతో రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను ఆతిథ్య శ్రీలంక జట్టు 1-0తో చేజిక్కించుకొని టైటిల్‌ను కైవసం చేసుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ నిస్సంకకు దక్కింది. ఇరుజట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. శ్రీలంక చేతిలో టెస్ట్ సిరీస్ కోల్పోయిన బంగ్లాదేశ్ జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ నజ్ముల్ హొసైన్ శాంటో గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు.

తొలిటెస్ట్‌లో విండీస్ చిత్తు

- **159 పరుగుల తేడాతో నెగ్గిన ఆసీస్**

బ్రిడ్జ్‌టౌన్: వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా 159 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఆసీస్ నిర్దేశించిన 301 పరుగుల లక్ష్య ఛేదనలో విండీస్ 141 పరుగులకే ఆలౌటైంది. లోయర్ ఆర్డర్ బ్యాటర్ షమార్ జోసెఫ్ (44) టాప్ స్కోరర్ కావడం గమనార్హం. జస్టిన్ గ్రీవ్స్ (38), జాన్ క్యాంప్‌బెల్ (23), కీసే కార్టీ (20) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్‌కు ఐదు, నాథన్ లయన్‌కు రెండు. మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్ చెరో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో పది పరుగుల వెనుకబడిన ఆసీస్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో అలెక్స్ కేరీ (65), వెబ్‌స్టర్ (61), ట్రావిస్ హెడ్ (61) రాణించడంతో 310 పరుగులు చేసింది. ఆసీస్ ఒక దశలో 65 పరుగులకే 4 వికెట్లు కోల్పోయినా.. క్యారీ, వెబ్‌స్టర్, హెడ్ అర్ధసెంచరీలతో రాణించి జట్టును ఆదుకున్నారు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 180కే ఆలౌట్ కాగా.. విండీస్ 190 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హేజిల్‌వుడ్‌కు లభించగా.. రెండో టెస్ట్ జులై 3నుంచి గ్రెనెడా వేదికగా జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68